తిరుపతి - చిత్తూరు
30 వసంతాల వార్త వార్షికోత్సవం 1996-2026
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టింగ్స్‌లో
# భారీ అక్రమాలు

### వెలుగులోకి వస్తున్న డిఎంహెచ్ఓ అవినీతి భాగోతాలు



చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:
జిల్లా వైద్యఆరోగ్యశాఖలో ఇటీవల జరిగిన మేల్ హెల్త్ అసిస్టెంట్ల పోస్టింగ్స్‌లో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలో విధులు నిర్వహించే మేల్ హెల్త్ అసిస్టెంట్లను మున్సిపాల్టీల్లో పోస్టింగ్స్ ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు కొంతమంది మేల్ హెల్త్ అసిస్టెంట్ల వద్ద పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని మున్సిపాల్టీల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి మొత్తం 250 వరకు మేల్ హెల్త్ అసిస్టెంట్ల పోస్టులు వున్నాయి. ఇందులో ప్రస్తుతం 114 మంది మేల్ హెల్త్ అసిస్టెంట్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒక్క చిత్తూరు జిల్లా పరిధిలో 151 మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు వుండగా ఈ జిల్లాలో 51 మంది మాత్రమే వున్నారు. మిగిలిన పోస్టులు ఖాళీగా వున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రతి పిహెచ్‌సికి ఒకటి నుండి మూడు వరకు మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు వున్నాయి. ఈ పోస్టుల్లో ఒక్క పోస్టునైనా డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు భర్తీ చేయాలి. అయితే ఈ పోస్టుల పోస్టింగ్‌లో భారీ అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఎవరైతే ఎక్కువ డబ్బులు ఇచ్చారో వారికి వారు కోరుకున్న ప్రాంతాల్లోకి పోస్టింగ్స్ జారీ చేసి డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు జేబులు నింపుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మేడికుర్తి పిహెచ్‌సిలో రెండు మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు వున్నాయి. ఈ పిహెచ్‌సిలో ఒక మేల్ హెల్త్ అసిస్టెంట్‌ను నియమిస్తే సరిపోతుంది. డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు పెద్దమండ్యం నుండి ఒక మేల్ హెల్త్ అసిస్టెంట్, అలాగే సోమల నుండి ఒక మేల్ హెల్త్ అసిస్టెంట్‌కు మేడికుర్తి పిహెచ్‌సికి పోస్టింగ్స్ ఇచ్చారు. అలాగే మున్సిపాల్టీల్లో మేల్ హెల్త్ అసిస్టెంట్ల స్థానంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు విధులు నిర్వహిస్తుంటారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు వుండటంతో మున్సిపాల్టీల్లో మేల్ హెల్త్ అసిస్టెంట్లకు ఏ మాత్రం పని వుండదు. జిల్లాలోని పిహెచ్‌సిల్లో మేల్ అసిస్టెంట్ పోస్టులు వుండి సిబ్బంది కొరత తీవ్రంగా వున్న పరిస్థితుల్లో పిహెచ్‌సిల్లో వున్న ఖాళీలను మేల్ హెల్త్ అసిస్టెంట్లకు పోస్టింగ్స్ ఇవ్వకుండా భారీ మొత్తం ముడుపులు తీసుకుని మున్సిపాల్టీలకు పోస్టింగ్స్ ఇవ్వడంతో ఈ వ్యవహారం ప్రస్తుతం తీవ్ర దూమారం రేపుతోంది. పెద్దమండ్యం పరిసరాల పిహెచ్‌సిలో మేల్ హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అతనిని మదనపల్లి మున్సిపాల్టీలో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే పలమనేరు పరిసర ప్రాంతాల్లో మేల్ హెల్త్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఒకరిద్దరి నుండి ముడుపులు తీసుకుని పలమనేరు మున్సిపాల్టీలో విధులు నిర్వర్తించేలా పోస్టింగ్స్ జారీ చేసినట్లు తెలిసింది. అలాగే ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ మేల్ అసిస్టెంట్‌కు తుంబకుప్పం పిహెచ్‌సికి పోస్టింగ్ ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో మేల్ హెల్త్ అసిస్టెంట్ల పోస్టింగ్ వ్యవహారంపై విచారణ నిర్వహిస్తే మరిన్ని అక్రమ పోస్టింగ్స్ వెలుగులోకి వచ్చే అవకాశం కన్పిస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్న డాక్టర్ నాగ శశిభూషణ్ ఈ వ్యవహారంపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశలు పెట్టుకున్నారు.

## తిరుపతిలో చెడ్డి గ్యాంగ్ హల్చల్



తిరుపతి, మార్చి 28ప్రభాతవార్త:
తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రఘునాథ రిసార్ట్స్ సమీపంలో ఉన్న ఓ ఇంటి లోకి దూరిన చెడ్డి గ్యాంగ్. దీంతో చెడ్డి గ్యాంగ్ చోరీ ప్రయత్నం విఫలమైంది. అప్రమత్తమైన కుటుంబ యజమానితో పరారైన చెడ్డి గ్యాంగ్ దొంగలు. బాధితుడు సునందకుమార్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు. చెడ్డి గ్యాంగ్ పర్యటించిన ప్రాంతాలలోని సీసీ కెమెరాలు రికార్డ్ అయిన దృశ్యాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్న తిరుపతి రూరల్ సిఐ మద్దయ్య ఆచారి. తిరుపతి జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ రాకతో కలకలం రేపుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిస్తున్నారు.

# దైవ దర్శనంకు వెళ్తూ... అనంతలోకాలకు...

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- ఒకే కుటుంబంలో ముగ్గురు ముగ్గురు మృతి
- మృతుల్లో భార్యభర్త, మూడేళ్ళ కుమార్తె







కారులో ఇరుకున్న మృతదేహాలను వెలుపలికి తీస్తున్న పోలీసులు,



తండ్రి గుండెలపై నిద్రిస్తూ మృత్యుఒడిలోకి వెళ్ళిన చిన్నారి

బంగారుపాళ్యం, మే 28 ప్రభాతవార్త:
కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబంను అర్టీసీ బస్సు మృత్యువు రూపంలో కబళించిన సంఘటన మండలంలోని పాలమాకులపల్లి వద్ద చోటు చేసుకుంది. బెంగళూరు నగరానికి చెందిన ఓ కుటుంబం తిరుమలేశుడి దర్శనం కోసం అద్దెకారులో శనివారం తెల్లవారుజాము 2 గంటలకు బయలుదేరగా ఆ స్వామి చెంతకు వెళ్ళకముందే ఉదయం 6.30 గంటలకు మృత్యు ఒడిలోకి జారుకున్నారు. ఈ దుర్ఘటన చూసిన పలువురు సంఘటనా స్థలంలోనే కన్నీరు పెట్టుకున్నారు. వివరాలిలా వున్నాయి. తెలంగాణ రాష్ట్రం వరంగల్ నగరం తుమ్మలకుంటకు చెందిన దాపు శ్రీధర్‌కుమార్, అతని భార్య ఎన్.లక్ష్మీలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా బెంగళూరు నగరం సింగచంద్రలో స్థిరపడ్డారు. వీరికి ఆద్విక మూడేళ్ళ కుమార్తె కలదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా శుఖ జీవితం సాగిస్తున్న వీరు తిరుమల దర్శనంగా కోసం అద్దె కారును కుదుర్చుకుని తెల్లవారు జాము 2 గంటలకు బెంగళూరు నుండి బయలుదేరారు. కారు ముందు సీటులో డ్రైవర్‌తో పాటు శ్రీధర్‌కుమార్(46) తన కుమార్తెను గుండెలపై పడుకోబెట్టుకుని ప్రయాణిస్తుండగా కారు వెనుక సీటులో అతని భార్య లక్ష్మీ(42) ప్రయాణిస్తున్నారు. పలమనేరు డిపోకు చెందిన అర్టీసీ బస్సు పలమనేరు నుండి చిత్తూరు వైపుకు వెళ్తూ పాలమాకులపల్లి వద్ద హైవేపై ప్రయాణీకుల కోసం డ్రైవర్ బస్సును నిలిపాడు. అదే సమయంలో బస్సు వెనుకవైపు నుండి అతి వేగంగా వస్తున్న కారు బస్సును ఢీకొంది. ఆ సమయంలో కారు ముందు భాగం పూర్తిగా బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీధర్‌కుమార్, అతని భార్య లక్ష్మీ, మూడేళ్ళ కుమార్తె ఆద్వికలు కారులోనే మృతి చెందారు. కారు డ్రైవర్ వెంకటేష్(38) తీవ్రంగా గాయపడగా స్థానికులు డ్రైవర్‌ను బయటికి లాగి చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతనికి మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ఆసుపత్రికి తరలించారు. కాగా కారు ముందు భాగం పూర్తిగా బస్సు కిందికి చొచ్చుకుపోవడంతో మృతదేహాలను బయటికి తీయడానికి పోలీసులు శ్రమించారు. క్రేన్, జెసిబిలతో పాటు గ్యాస్ కట్టర్‌లను ఉపయోగించి బస్సు, కారును వేరు చేశారు. అనంతరం కారులో ఇరుక్కుని వున్న మృతదేహాలను బయటికి తీసి శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్, స్థానిక ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు, డిటిసి నిరంజన్‌రెడ్డి, ఎంవిఐ రాజేశ్వరరావులు సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు.

### కంటతడి పెట్టిన పలువురు

పాలమాకులపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తతో పాటు మూడేళ్ళ చిన్నారి మృతి చెందింది. కారు అతి వేగంగా వస్తూ బస్సు వెనుకవైపు ఢీకొనడంతో కారు పూర్తిగా బస్సు కిందికి చొచ్చుకుపోయింది. ఆ సమయంలో కారులో ప్రయాణిస్తున్న శ్రీధర్‌కుమార్ తమ మూడేళ్ళ కుమార్తె ఆద్వికను తన గుండెలపై పెట్టుకుని అలాగే మృత్యువాత పడ్డారు. వెనుక సీటులో భార్య లక్ష్మీ సైతం మృతి చెందింది. బస్సు నుండి కారును పోలీసులు కష్టం మీద వేరు చేయడంతో ముందు సీటులో తండ్రి కుమార్తె మృతి చెందిన మృతదేహాలు చూసి పలువురు కంటి పెట్టారు. తండ్రి గుండెలపై వెచ్చగా నిద్రిస్తున్న ఓ చిన్నారిని ఆ భగవంతుడు ఈ విధంగా తీసుకెళ్ళాడా! అని పలువురు కన్నీరు కార్చారు.

## రేపు ఎస్వీ వెటర్నరీ వర్సిటీ 13వ స్నాతకోత్సవం

### ఛాన్సలర్ హోదాలో హాజరుకానున్న గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్
### యూజీ, పీజీ,పీహెచీ పట్టాలు .. 35 బంగారు పతకాలు



తిరుపతి విద్య మార్చి 28 ప్రభాతవార్త
తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఇంచార్జి వీసీ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. శనివారం వర్సిటీలోని వైఎస్సార్ పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువైద్యకళాశాల ఆడిటోరియంలో జరగనున్న కాన్వొకేషన్ కార్యక్రమానికి ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఎస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని చెప్పారు. ఆయనతో పాటు నాగపూర్లోని మహారాష్ట్ర యానిమల్ అండ్ ఫిషరీ సైన్సెస్ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ నితిన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. 202324 విద్యా సంవత్సరంలో యూజీ, పీజీలు పూర్తి చేసుకున్న తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాల, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల, గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలకు చెందిన 415 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను గవర్నర్ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో 8మందికి పీహెచ్, 144 మందికి ఎంవీఎస్సీ, 227 మందికి బీవీ ఎస్సీ అండ్ ఎహెచ్, 36 మంది బీటెక్ డైరీ టెక్నాలజీ విద్యార్థుల పట్టాలు అందుకోనున్నారని చెప్పారు. అలాగే అకడమిక్ విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 35 బంగారు, 2 వెండి పతకాలతో పాటు ఒక నగదు బహుమతిని ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే బోధన, పరిశోధన, విస్తరణ రంగాలలో విశేష కృషి చేసిన అధ్యాపకులకు ప్రతిభా పురస్కారం, పరిశోధక శాస్త్ర పురస్కారం, శ్రీ నీలకంఠపురం శ్రీరామరెడ్డి బంగారు పతకం, డాక్టర్ వి పాండురంగరావు ప్రతిభా అవార్డులు ప్రధానం చేస్తామని చెప్పారు.వ్యవసాయ సమాజానికి సంబంధించిన ఉత్తమ డాక్టరేట్ పరిశోధనకు శ్రీ ముప్పవరపు ఫౌండేషన్ బంగారు పతకం, పశుపోషణలో విశేష మాస్టర్స్ పరిశోధనకు డాక్టర్ ప్రతాప్ వి రెడ్డి బంగారు పతాకం ప్రధానం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ వినూ, డీన్లు, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 30న ముఖ్యమంత్రి నాయుడుపేట రాక

### - పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ , కలెక్టర్



ఈ నెల 30వ తేదిన నాయుడుపేట పుదూరు గ్రామం నందు టిడ్కో గృహాలను ప్రారంభోత్సవ చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పై నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలో ఏఎస్ఎల్‌లో (మందస్తు భద్రత లైజన్) భాగంగా ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, అడిషనల్ ఎస్.పి రవి మనోహారాచారి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేంద్ర రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 30 వ నాయుడుపేట పుదూరు గ్రామం నందు టిడ్కో గృహాలను ప్రారంభోత్సవ, గృహప్రవేశం చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మార్చి 30 వ తేదీన నాయుడుపేట నెలబల్లి గ్రామం నందు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకొని అక్కడ నుంచి టిడ్కో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులతో మాట్లాడడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాట్లును పరిశీలించి, సభా వేదికకు చేరుకుంటారని తెలిపారు. ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. అగ్నిమాపక వాహనమును అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ వారు ప్రత్యేక డాక్టర్లను అంబులెన్స్ వాహనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమం జరుగు అన్ని ప్రదేశాలలో పారిశుద్ధం, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పర్యటన ఏర్పాటు లలో నిధులు కేటాయించిన అధికారులు ఆలస్యం లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ హెలిప్యాడ్ పోలీస్ శాఖ తరపున బందోబస్తు పక్కగా ఉండాలని తెలిపారు. హెలిప్యాడ్ సభ వేదిక వెళ్ళు వరకు మందస్తు భద్రత ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు.
ఫోటో

## కడ పి.డి.చే దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

### - రెండు దుకాణాలు సీజ్..సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిల్వలు స్వాధీనం !!





కుప్పం, మార్చి 28 ప్రభాతవార్త
కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర మ్రత్ శనివారం కుప్పం పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా స్థానిక టి.బి. రోడ్, మురుగన్ థియేటర్ వీధిలోని రెండు దుకాణాల్లో భారీ మొత్తంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉండడంతో ఆయా దుకాణాలను సీజ్ చేయాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, అర్బన్ ఎస్సై బాబులను ఆదేశించారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిల్వలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని న్యూబైపాస్ లింక్ రోడ్డులో ఉన్న రెండు దుకాణాలు, రాధాకృష్ణరోడ్‌లో ఉన్న ఓ దుకాణంలో సైతం తనిఖీలు చేపట్టారు. పట్టణంలో మూడు నెలల్లో పూరి_్తగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు తెలిపారు. దుకాణాల్లో వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వి క్రయిస్తే కఠిన

## మార్చి 30, 31న రాష్ట్ర గవర్నర్
# తిరుపతి, తిరుమల పర్యటన

తిరుపతి కలెక్టరేట్, మార్చి 28 ప్రభాత వార్త:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఈ నెల 30, 31 తేదీలలో తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ శనివారం పేర్కొన్నారు. గవర్నర్ తన పర్యటనలో భాగంగా ఈ నెల 30న మ.2.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అనంతరం మ.3.00 గం.లకు తాజ్ హోటల్ చేరుకుంటారన్నారు. అనంతరం తాజ్ హోటల్ నుండి బయల్దేరి సా.4.00 గం.లకు శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ చేరుకుని విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొని సా.6.25 గం. లకు తిరుమల శ్రీ భాగ్య రెస్ట్ హౌస్ చేరుకుని రాత్రి బస చేస్తారన్నారు. మరుసటి రోజు ఉ.9.30 గం.లకు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకుని మ.2.00 గం.లకు తిరుమల నుండి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారని, అనంతరం మ.3.20 గం.లకు హైదరాబాద్ బయల్దేరి వెళతారన్నారు.

## సింహవాహనంపై ఊరేగిన శ్రీకోదండరాముడు

తవణంపల్లె, మార్చి 28 ప్రభాతవార్త:
మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీసీతా సమేతుడైన కోదండరాముడు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో శుక్రవారం నుండి శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైన విషయం విధితమే. ఈకార్యక్రమానికి అరగొండ, పైమాఘంకు చెందిన గాండ్ల కులస్థులు ఉభయదారులుగా వ్యవహరించి ఉదయం వరుస ఉభయం తీసుకు వచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి,అలంకరించి ప్రత్యేకపూజలు చేసి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం సింహవాహనపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా

## టిడ్కో లబ్ధిదారుల కలలు
# సాకారం అయ్యే వేళ
## 31న పంపిణికి సిద్ధం

శ్రీకాళహస్తి,మార్చి 28 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో నిర్మించిన టిడ్కోగృహాలను ఈ నెల 31న లబ్ధిదారులకు అందించుటకు సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిటి భవాని ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.మొదటి విడతలో 1648 ఇళ్ళను లబ్ధిదారులకు అందించుటకు సిద్ధం చేస్తున్నారు. ఇందులో రూ.500లు చెల్లించిన లబ్ధిదారులకు 1200ఇళ్ళు, రూ.50వేలు చెల్లించిన లబ్ధిదారులు 148మందికి రూ.లక్ష చెల్లించిన 320 మందికి ఇళ్ళను అందించనున్నారు. మిగిలిన వారికి జూన్ నెలాఖరుకు సిద్ధం చేస్తున్నారు.ఈ నెల 31న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయుడుపేటలో టిడ్కోఇళ్ళను లబ్ధిదారులకు అందిచనున్నారు. అలాగే అక్కడ నుంచే జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సిద్ధం అయిన ఇళ్ళను కూడా అందించుటకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు.



### ఏడేళ్ళ నిరీక్షణకు ప్రతిఫలం:

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 2018లో అప్పటి శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణలు ఇక్కడ నిర్మించిన టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు అందించుటకు 2019 ఎన్నికల ముందు మున్సిపల్ కార్యాలలయంలో హంగామా సృష్టించారు.లబ్ధిదారులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి లాటరీ పద్ధతిలో ఇళ్ళను కేటాయించారు. లబ్ధిదారులకు టోకేన్లు కూడా అ ందించారు.అప్పటిలో మొత్తం6015 మందిని ఎంపిక చేసారు. 2019లో ప్రభుత్వం మారిన తరువాత టిడ్కో గృహలను' మసి పూసిన మారెడు' చేసారు.టిడ్కో గృహాలు రావని నమ్మబలికి జగనన్న కాలనీలో అవకాశం అంటూ లబ్ధిదారుల చేత రాతమూలకంగా రాయించుకున్నారు. ఇలా సుమారు 1600 మంది వద్ద రాతమూలకంగా రాసుకున్నారు. ఈ ఇళ్ళను తలా కొంచెం తిలా పాపం అన్నట్లు అదికారులు,అప్పటి రాజకీయ నాయకులు పంచుకున్నారు. నాయకుడు వారి అనుచరులకు రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి వెంట పడ్డారు.ఎట్టకేలకు కాంట్రాక్టర్‌ను మళ్ళీ యాక్టివ్ చేసారు. ఆగిన పనులను పూర్తి చేయుటకు సిద్ధం చేసారు.ఈ నేపధ్యంలో ఈ నెల 31న 1648 ఇళ్ళను ఇవ్వటానికి సిద్ధం చేసారు. కాలనీలో అన్ని సదుపాయాలను కల్పించారు.

### వద్దనుకున్న లబ్ధిదారులు సొమ్ములు వాపస్:

ఇక వైకాపా పాలనలో వారి మాయలో పడి తమకు టిడ్కోఇళ్ళు వద్దని రాసిచ్చిన వారు జగనన్న కాలనీలో ప్లాట్లు తీసుకున్నారు.అయితే అక్కడ వారు ఇళ్ళను నిర్మించుకోలేదు.కానీ కంప్యూటర్లో మాత్రం టిడ్కో ఇళ్ళను రద్దు చేసుకున్నట్లు నమోదైంది. అంతేకాక ఎక్కడ స్థలం ఉందో తెలియదు కానీ ఇళ్ళు నిర్మించుకున్నట్లు రికార్డు అయ్యింది.దాంతో రెండికి చెడ్డ రేవడిలా మారింది. అయితే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టిడ్కో ఇళ్ళను వద్దనుకున్న వారి డిపాజిట్లును వాపసు ఇవ్వటానికి కూడా ప్రభుత్వం ముందడుగు వేసిందని కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు. మొదటి విడతగా రూ.10కోట్లు మంజూరు అయ్యినట్లు వివరించారు.ఆ నిధులు విడుదల కాగానే డిడిలు చెల్లించిన వారికి వాపసు ఇవ్వబడుతుందని వివరించారు. మొత్తం 1600 మంది లబ్ధిదారులను గుర్తిచగా ప్రస్తుతం 500 మందికి వాపసు ఇవ్వటానికి సిద్ధం చేస్తున్నామని కవిషనర్‌భవాని ప్రసాద్ వివరించారు.




## చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వీల్‌చైర్లు విరాళం

**చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:**



అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(ఎఐఎంఎస్ఆర్)కు చెందిన 2020 బ్యాచ్ ఎంబిబిఎస్ గ్రాడ్యుయేట్లు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి 30 వీల్ చైర్లు, 10 స్ట్రెక్చర్లను ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బిజి రంగనాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బిజి రంగనాథ్ మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించిన సంస్థకు తిరిగి సేవ చేయాలనే బాధ్యతతో వైద్య విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉపయోగపడే వీల్ చైర్లు, స్ట్రెక్చర్‌లు అందించడం ద్వారా వారి సేవా దృక్పథం అర్థమవుతుందన్నారు.

## పూతలపట్టులో వారపు సంత 11 రూములకు పెరిగిన పోటీ

**పూతలపట్టు, మార్చి 28, ప్రభాతవార్త**



పూతలపట్టు మండలంలో పూతలపట్టు పంచాయితీ పరిధిలో ఉన్న సచివాలయం కార్యాలయంలో వేలం పాట పంచాయతీ సెక్రటరీ చంద్రమోళి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళి పాల్గొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు వేలం పాట జరిగింది. ఈ సారి కూడా వారే దక్కించుకున్నారు. అత్యంత ఉత్కరభరితంగా సాగింది. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వేలం పాటలో సాధారణంగా మంచి పోటీ ఉండేలా ఉన్నప్పటికీ ఈ సారి మాత్రం హోరాహోరిగా వేలం పాట పోటీ జరిగింది. ఆసక్తి కనిపించింది. ఈవోపిఆర్‌డి శ్రీనివాసులు వైసిపి సర్పంచి మాసులమని వైఎస్ఆర్ రాష్ట్ర మహిళ సంయుక్త కార్యదర్శి గౌహిత ఎక్స్ మండల కన్వీనర్ చంద్రమౌళి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవరత్నం వైయస్సార్‌సిపి ఉప సర్పంచ్ బాబు రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట లో పారదర్శంగా నిర్వహించారు. పూతలపట్టు సంత వేలంపాటలో 14,10,500 రూపాయలు దక్కించుకున్న కాజా కాంప్లెక్స్ 11 రూములు వేలంలో బాలాజీ రూ. 8600, భాస్కర్ శెట్టి రూ. 8050, మురళి రూ. 8050, జయరాం రూ. 7500, కృష్ణమూర్తి రూ. 10000, సుబ్రహ్మణ్యం రూ. 7500, పి. రఘు రూ. 7600, టి. జ్యోతి రూ. 7800, శాంతమ్మ రూ. 7600, సావిత్రి రూ. 7600, సుందర్ రాజు రూ. 11000 దక్కించుకున్న అభ్యర్థులు ఈ సంవత్సరానికి వారపు సంత ఆదాయం 14,10,500 లక్షల రూపాయలు నెలకు ఒకసారి కాంప్లెక్స్ రూములో ఆదాయం 91,300 వేల రూపాయలు ఈ ఆదాయాన్ని గ్రామపంచాయతీ అభివృద్ధికి మౌలిక వసతులు మెరుగదలకు పంచాయితీ మరమత్తులు త్రాగునీరు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పన వంటి పనులను వినియోగించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పారిశ్రామికవేత్త ముత్తు, ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివస్

**కాణిపాకం, మార్చి 28 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర దేవాదాయ, దర్మధాయశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం అతిథి గృహం వద్ద మొదటగా సిబ్బందితో స్వచ్ఛాంద్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది దేవస్థానం అతిథి గృహం నుండి ర్యాలీ నిర్వహించి ఆలయ మాడా వీధులు, బస్టాండు పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంపై భక్తులకు, వ్యాపారస్థులకు అవగాహన కల్పించారు. అలాగే దేవస్థానంకు సంభందించిన టాయిలెట్స్‌ను ఈఓ పెంచల కిషోర్ పరిశీలించి వాటిని పరిశుభ్రంగా వుంచాలని లేకుంటే పారిశుద్య ఏజెన్సీపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు బాలరంగస్వామి,కోదండపాణి, శానిటరీ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

**కాణిపాకం, మార్చి 28 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి వారి దేవ స్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్న దాన పథకానికి ఓ భక్తురాలు శని వారం లక్ష రూపాయలను విరా ళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు మియాపూర్‌కు చెందిన మాధవి అనే భక్తురాలు నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలు విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి కేసులో నిందితుల అరెస్ట్

**తవణంపల్లె, మార్చి 28 ప్రభాతవార్త:**

మండలంలోని తొడతర గ్రామంలో మహిళపై దాడి చేసిన ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం తొడతర గ్రామానికి చెందిన రోజా ఇంట్లో ఒంటరిగా వున్న సమయంలో అదే గ్రామానికి చెందిన భానుప్రియ, జ్యోతి అనే మహిళలు దాడి చేసి తీవ్రంగా గాయపరచినట్లు రోజా అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులు ఇరువురిని శనివారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## బిసిఎన్ విద్యాసంస్థల సెక్రటరీ సాగర్‌రాజ్‌చే వితరణ

**కుప్పం, మార్చి 28 ప్రభాతవార్త**



కుప్పం బిసిఎన్ విద్యా సంస్థల సెక్రటరీ సాగర్‌రాజ్ శనివారం పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆయన జన్మదినం సందర్భంగా ప్రభుత్వ కళాశాలకు 35వేల విలువ చేసే నీటి శుద్ధి యంత్రం, కస్తూరిబా గురుకులంకు పాతికవేల విలువ చేసే స్పీకర్, మైక్‌సెట్‌ను విరాళ ంగా అందజేశారు. ఈ సందర్భంగా కుప్పం డిగ్రీ కాలేజ్‌లో భారీ ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. కుప్పం అన్న క్యాంటీన్‌లో పేదలకు ఉచిత ఆహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాలకు బిసిఎన్ గ్రూప్స్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కెడిసి ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, సభ్యులు సెల్వం, జయరాంనాయుడు, కౌన్సిలర్లు సోమశేఖర్, కస్తూరి వేలు, రెస్కో డైరెక్టర్ శివ పాల్గొన్నారు.

## బిసిల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయండి

**– జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం**

**చిత్తూరురూరల్, మార్చి 28 ప్రభాతవార్త:**



జాతీయ బిసి సంక్షేమ సంఘ ఆద్వర్యంలో ఏప్రిల్ 19 ఆదివారం రాజకీయ పార్టీలకు అతీతంగా తిరుపతిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బిసిల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి షణ్ముగం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బిసి వర్గాలకు పిలుపునిచ్చారు. శనివారం బిసి సంక్షేమ సంఘు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేది నుంచి దేశ వ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణలో బిసి జనాభా లెక్కలు తేల్చాలని, చట్టసభలలో బిసిలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ, 50వేల కోట్లతో బిసిలకు ప్రత్యేక సబ్‌ప్లాన్, బిసిల ఆదాయ పరిమితి 20లక్షలకు పెంచడం, సంచాతర జాతులకు విద్య, ఉద్యోగ రాజకీయాలలలో 10శాతం ప్రత్యేక రిజర్వేషన్లు తదితర దీర్ఘకాలికంగా బిసిల అపరిష్కృత సమస్యలను పరిష్కారం చేసుకొనే దిశలో ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బిసి కుల సంఘాలు, చేతివృత్తిదారులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, రాజకీయ బిసి ప్రతినిధులు వేలాదిగా తరలిరావాలని కోరారు. అనంతరం బిసీల ఆత్మీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బిసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్రరాజు, రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, రాష్ట్ర మేదర సంఘు కార్యదర్శి రమేష్‌బాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శులు లావణ్యకుసుమ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సునీత, జిల్లా ఉపాధ్యక్షులు హరిప్రసాద్, బిసి సంక్షేమ సంఘు యువజన కార్యదర్శి కిరణ్, జిల్లా కార్యదర్శులు పృద్వీరాజ్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణకు ధరఖాస్తులు ఆహ్వానం

**చిత్తూరురూరల్, మార్చి 28 ప్రభాతవార్త:**

చిత్తూరు జిల్లాలో వేసవిశిక్షణా శిబిరాల నిర్వహణకు గుర్తించబడిన కోచింగ్ సెంటర్లు, ఆసక్తి కలిగిన పిడి, పిఇటి, సీనియర్ కోచ్, క్రీడా అసోసియేషన్ నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31వ తేది వరకు నిర్వహించు వార్షిక వేసవి శిక్షణా శిబిరం నందు క్రీడలు ఉదయం 6నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు జరుగుతుందన్నారు. క్రీడా శిబిరాలు నిర్వహించదలచినవారు ఏప్రిల్ 5వతేది సాయంత్రం 5గంటల లోపు క్రీడాప్రాధికార సంస్థ, చిత్తూరు నందు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సదవకాశంను ప్రతి విద్యార్థి, పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు.

## చిత్తూరు ఆసుపత్రిలో విజయవంతంగా మోకాళ్ళ మార్పిడి శస్త్రచికిత్స

**– నడవలేని వృద్ధుడికి నూతన జీవితం ప్రసాదించిన అపోలో వైద్యులు**

చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:



చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మంచానికే పరిమితం అని భావించిన 76 సంవత్సరాల వృద్ధుడికి మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి వైద్యులు ఆయనకు నూతన జీవితంను ప్రసాదించారు. తీవ్రమైన కిడ్నీ సమస్యలు, శరీరంలో తక్కువ రక్తం, పూర్తిగా అరిగిపోయిన మోకాళ్ళతో నడవలేని స్థితిలో వున్న వృద్ధుడిని అపోలో వైద్యాధికారులు మళ్ళీ నడిచేలా చేశారు. బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామంకు చెందిన కె.వేణుగోపాల్‌రెడ్డి(76) గత కొంతకాలంగా తీవ్ర మోకాళ్ళ నొప్పులు, కిడ్నీ సమస్యలతో బాధపడుతూ మంచంకు పరిమితం అయ్యాడు. శరీరంలో రక్తం తక్కువగా వుండటంతో ఇతర ఆసుపత్రులు శస్త్ర చికిత్స చేయడానికి నిరాకరించగా అతను చివరికి చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆశ్రయించాడు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులు ముందుగా ఆయన ఆరోగ్య పరిస్థితిని స్థిరపరచి అనంతరం క్లిష్టమైన మోకాలి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స చేసిన మరుసటిరోజే కె.వేణుగోపాల్‌రెడ్డి స్వయంగా లేచి నడవడం విశేషం. కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం క్లిష్టంగా మారుతున్న ఇలాంటి శస్త్రచికిత్సలను చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్యులు చేస్తుంటంతో ఆర్థో విభాగం వైద్యాధికారులు అందరి ప్రసంశలు అందుకుంటున్నారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆర్థో విభాగంలో డాక్టర్ వంక అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఆశీష్, డాక్టర్లు మొగిలేష్, రేవంత్‌లు, అనస్థీషియా నిపుణులు డాక్టర్ జయంత్, ఎం.దేశ్‌ముఖ్‌ల బృందం సమన్వయంతో పని చేస్తూ రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్నారు. ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బిజి రంగనాధ్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు ఏ మాత్రం తీసిపోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోను క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

## 2వ తేదీ నుండి విలేకరులకు ఆరోగ్య పరీక్షలు

**– కలెక్టర్ సుమిత్‌కుమార్**

**చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:**

జిల్లాలోని అక్రిడిటేషన్ జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 8 గంటల నుండి చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని అపోలో బ్లాక్ నందు అపోలో ఆధ్వర్యంలో మెడికల్ మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మాస్టర్ హెల్త్ చెకప్‌లో బిపీ, షుగర్, ఇసిజీ, 2డి, ఎకో, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ తదితర కీలక పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్ట్, న్యూరో, ఆర్థో, గ్యాస్ట్రో నిపుణుల ద్వారా తనిఖీలు చేయిస్తారన్నారు. వైద్య పరీక్షలకు హాజరు కావాలనుకునే జర్నలిస్టులు పేరు, పని చేస్తున్న పత్రిక, అక్రిడిటేషన్ నెంబర్, కుటుంబసభ్యుల వివరాలు, అందరి ఆధార్ జెరాక్స్ కాపీలను ఏప్రిల్ 2వ తేదీ కౌంటర్లలో సమర్పించాల్సివుంటుందన్నారు. అలాగే ప్రస్తుతం అక్రిడిటేషన్ లేని వారు గతంలో అక్రిడిటేషన్ కార్డు పొందిన కార్డును నమోదు చేసి పరీక్షలు నిర్వహించుకోవచ్చునన్నారు.

## ఇచ్చిన హామీ మేరకు వడ్డెరల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వం

**– జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి**

**చిత్తూరుహెల్త్, మార్చి 28 ప్రభాతవార్త:**



యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెర్లకు మైనింగ్ లీజుల్లో 15 శాతం రిజర్వేషన్లు, 50 శాతం సీనరేజీ రాయితీలను కల్పించి కూటమి ప్రభుత్వం వడ్డెరల జీవితంలో వెలుగులు నింపిందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం వడ్డెర సామాజిక వర్గ ప్రతినిధులు పిఎం నరేంద్రమోడి, సిఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్, డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి మాట్లాడుతూ వడ్డెర ఒక కులం కాదని అది త్యాగానికి ప్రతీక అని ఇల్లు, గుడి కట్టాలంటే వడ్డెర్ల కష్టం చెప్పుకోదగిందిగా వుంటుందన్నారు. వడ్డెరల కష్టంను గుర్తించిన కూటమి ప్రభుత్వం వారి జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా టిడిపి కార్యదర్శి ధరణిప్రకాష్, డైరెక్టర్ గజేంద్ర, పెద్దన్నలు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## వ్యర్థాలు రహితంగా కార్యాలయాలు

**– అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్**

**చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:**



ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల్లో ఉత్పన్నం అయ్యే వ్యర్థాలను సమర్థవంతంగా పునర్వినియోగించడం ద్వారా వ్యర్థాల రహితంగా మార్చాలని అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడెల్ అన్నారు. స్వర్ణఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు మురకంబట్టులోని ఎపి మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ట్రైనీ డిప్యుటీ కలెక్టర్ సురేష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్ మాట్లాడుతూ పాఠశాలలు, కార్యాలయాలు, ఇతర సంస్థల్లో వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేయడం, స్థానికంగా హోంకంపోస్టింగ్ చేసి కిచెన్ గార్డెన్స్ ద్వారా కూరగాయాలు పండించాలన్నారు. ఈ సందర్భంగా వ్యర్థాలను వేరు చేడయం, హోమ్ కంపోస్టింగ్, చికెన్ గార్డెన్‌లపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో కంపోస్టింగ్ పిట్, వర్షపు నీటి ఇంకుడు గుంతను ఏర్పాటు చేయించారు. అలాగే మొక్కలు నాటించారు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతిజ్ఞ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, మున్సిపల్ అధి కారులు, సిబ్బంది పాల్గొని స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అలాగే నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్ల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

## సింహ వాహనంపై ఊరేగిన కాశీ విశ్వేశ్వరుడు

**రామకుప్పం,మార్చి28 ప్రభాతవార్త**



మండల కేంద్రంలో వెలసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా మూడవ రోజు సింహ వాహనంపై స్వామివార్లు ఊరేగారు. శనివారం ఉదయం శాస్త్రవేత్తంగా అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పేద పండితులు నాగరాజు శర్మ ఉత్సవమూర్తులను ఉత్సవం పై అధిరోహించి ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు ఊంజల సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తాదులు తరలివచ్చి శివ నామస్మరణతో మార్మోగించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు.

## ఏడాది తర్వాత బయటకొచ్చింది

**అందుబాటులో లేని డ్రోన్ సేవలు**

**వ్యవసాయ శాఖ అధికారి తీరుపై రైతుల ఆగ్రహం**

**వి.కోట, మార్చి 28 ప్రభాతవార్త:**



వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది.డ్రోన్ల ద్వారా మందులు పిచికారి చేసేందుకు మండలానికి డ్రోన్ పరికరాలను పలువురికి కేటాయించింది. వి.కోట మండలానికి ఏడాది క్రితమే డ్రోన్ పరికరం రైతు సంఘాలకు అందజేసింది.వాటిని వినియోగంలోకి తేవడంలో వ్యవసాయ శాఖ అధికారి తీవ్రంగా విఫలమయ్యారు.శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పర్యటన ఉండటంతో డోన్ పరికరాన్ని ఎగరేసి వెళ్లిపోయారు. కనీసం పదిమంది రైతులు కార్యక్రమంలో లేకపోవడం వ్యవసాయ అధికారి నిర్లక్ష్యానికి నిదర్శనం. రైతులను సమీకరించి డ్రోన్ పరికరం వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అధికారి ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.జిల్లా అధికారి వచ్చారని పరికరాన్ని బయటకు తీసి ఫోటోలు తీసుకొని వెళ్ళిపోవడమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.సాంకేతిక పరిజ్ఞానం రైతులకు చేరవేయడంలో వ్యవసాయ శాఖ అధికారి తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రోన్ సేవలు రైతులకు అందుబాటులోకి తేవడంలో ఉదాసీనంగా వ్యవహరించిన వ్యవసాయ శాఖ అధికారి పై చర్యలు తీసుకొని,ప్రతి రైతుకు డ్రోన్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని వారు కోరుతున్నారు.

## కట్టమంచి గోవర్ధన్ బాబీని సన్మానించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:**



ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ సౌత్ జోన్ ఛైర్మన్‌గా రెండవ సారి ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన కట్టమంచి గోవర్ధన్ బాబిని శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ సన్మానించారు. ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ సౌత్ జోన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కట్టమంచి గోవర్ధన్‌బాబి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలుగు రాష్ట్రాల నుండి ఛైర్మన్ పదవికి రెండవ సారి ఎన్నికైనందుకు సంతోషం వ్యక్తం చేస్తూ సన్మానించారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న కాలంలో రైతులు, పరిశ్రమలను సమన్వయపరస్తూ ఆహార పరిశ్రమను ముందుకు తీసుకెళ్ళాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తలపులపల్లి బాబురెడ్డి, శివకుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలం తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త

సిఐ సురేష్‌కుమార్

చంద్రగిరి, మార్చి 28 ప్రభాతవార్త:



వేసవి కాలం పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సిఐ సురేష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలం పిల్లలు ఈత కోసం వెళ్ళడం ప్రాణాపాయ స్థితికి గురికావడం పట్ల తల్లిదండ్రులు సరి చూసుకోవాలని అన్నారు. అదేవిధంగా రాత్రి వేళల్లో యువకులు బైక్ రైడింగ్‌లు వలన ప్రమాదాలబారిన పడే అవకాశం వున్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా వుండాలన్నారు. వేసవి కాలంలో అపచిత వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా వేసవి సెలవులకు ఇల్లు వదలి ఎక్కడైన వేరే ప్రదేశాలకు వెళ్ళే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఇరుగు పొరుగు వారికి చెప్పి వెళ్ళడం, ఇంట్లోని విలువైన వస్తువులను మీ బంధువుల ఇళ్ళల్లో దాచుకుని వెళ్ళాలని సూచించారు. వేసవి కాలంలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్లను గమనించుకోవాలని, చోరీకి గురైతే పంటలు ఎండిపోయే పరిస్థితి వుంటుందన్నారు. సైబర్ నేరగాళ్ళతో జాగ్రత్తగా వుండాలనీ, ఎక్కడా డిజిటల్ అరెస్ట్‌లు వుండవని అన్నారు. మ్యారేజీ బ్యురోల పేరిట హనీట్రాప్‌లకు గురికాకుండా చూసుకోవాలన్నారు. ప్రజల రక్షణ కొరకు ప్రత్యేక బృందాలతో పటిష్ట పోలీసు గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైనట్లయితే పోలీసులను సంప్రదించాలన్నారు. 10930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

## విలువలతో పాటు ప్రతిభను చాటుకున్న చిన్నారులు

ఘనంగా జెసీఆర్ చైతన్య వార్షికోత్సవం

తిరుపతి విద్య, మార్చి 28 ప్రభాతవార్త



స్థానిక వరదరాజు నగర్‌లో ఉన్న జెసీఆర్ చైతన్య పాఠశాల 5వ వార్షికోత్సవం శనివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కెజీ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అగ్రికల్చరల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన ప్రొఫెసర్ కే శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎస్‌వీయూ రీసెర్చ్ స్కాలర్ గరికపాటి రమేష్ బాబు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ కే శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సమయపాలన అలవాటు చేసుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత భావం కలిగి ఉండాలని, మంచి విలువలతో ఎదిగినప్పుడే సమాజానికి ఉపయోగపడే పౌరులుగా మారగలరని అన్నారు. అలాగే గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక విద్యా పద్ధతులపై అవగాహన అవసరమని తెలిపారు. పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ స్వయంసాధనకు సమయం కేటాయిస్తూ, విఫలాలను పాఠాలుగా తీసుకుని ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జై చంద్ర రెడ్డి, డైరెక్టర్ వై వినయ చైతన్య మరియు ఎస్ భారతి పాల్గొన్నారు. వారు విద్యార్థులను అభినందిస్తూ పాఠశాల అభివృద్ధికి తమ కట్టుబాటును తెలియజేశారు. మొత్తంగా ఈ వార్షికోత్సవం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆనందాన్ని కలిగిస్తూ విజయవంతంగా ముగిసింది.

## రికార్డు దిశగా గీతా పారాయణం

222 మంది విద్యార్థుల అద్భుత సమన్వయం

తిరుపతి విద్య, మార్చి 28 ప్రభాతవార్త




తిరుపతిలోని ప్రాంతీయ సైన్స్ సెంటర్‌లో వేదిక్ విద్యాన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పారాయణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 222 మంది విద్యార్థులు ఏకకాలంలో, సమన్వయంతో పాల్గొని 2 గంటల 22 నిమిషాల పాటు నిరంతర పారాయణం చేయడం విశేషం. పాఠశాల చైర్మన్ మహేష్, కరస్పాండెంట్ పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచింది. చిన్నారుల ఏకాగ్రత, ఉచ్చారణ, సమయపాలన అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన విశ్రాంత ప్రిన్సిపాల్ డా. సి. శ్రీరాములు, సంస్కృత ప్రొఫెసర్ సింగంసెట్టి సుబ్బరాయుడు, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. పైడి అంకయ్య, ట్రెడిషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి సురేఖ విద్యార్థులను అభినందించారు. ఈ పారాయణాన్ని రికార్డులో నమోదు చేస్తున్నట్లు ప్రకటించి, ధ్రువపత్రాన్ని పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. అతిథులు మాట్లాడుతూ భగవద్గీతలోని సందేశాలు జీవితానికి మార్గదర్శకమని, చిన్న వయస్సులోనే ఆధ్యాత్మిక విలువలను అలవర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. మొత్తంగా ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భక్తి, క్రమశిక్షణ, సాంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించే విధంగా విజయవంతంగా సాగింది.

## జాతీయ స్థాయిలో వాలీబాల్‌లో విజయం

శ్రీ పద్మావతి కళాశాల విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి విద్య, మార్చి 28 ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల గేమ్స్ , స్పోర్ట్స్ విభాగానికి చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకున్నారు. మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మార్చి 25 నుంచి 27 వరకు నిర్వహించిన టుడే నేషనల్ లెవెల్ టెక్నో అండ్ కల్చరల్ - స్పోర్ట్స్ ఫెస్ట్ లో పాల్గొన్న వారు వాలీబాల్ విభాగంలో మొదటి స్థానం సాధించారు. ఈ విజయంతో విద్యార్థినులు మెడల్స్, సర్టిఫికెట్లు తో పాటు రూ.6,000 నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ డా. టి నారాయణమ్మ మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డా. బి భారతి, వైస్ ప్రిన్సిపల్ డా. జి భద్రమణి, డిప్యూటీ వార్డెన్ ఎం భారతి, డా. బి జ్యోతి, డా. సరిత , విద్యార్థినులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముందుకు సాగాలి

సత్యవేడు, మార్చి 28 ప్రభాతవార్త:




పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని శనివారం సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముందుండాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిశుభ్రతపై ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో హరిప్రసాద్ మాట్లాడుతూ యువత పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిసరాలను పరిశుభ్రపరచి ప్లాస్టిక్‌ని తొలగించారు. అనంతరం నా చెత్త-నా బాధ్యత అన్న నినాదాలతో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హరిప్రసాద్, రవిశంకర్, వెంకటేశులు, ఈశ్వరయ్య, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## పాకాల పంచాయతీకి వేలంపాట ద్వారా

రూ.36 లక్షలకు పైగా ఆదాయం

పాకాల, మార్చి 28, ప్రభాతవార్త



పాకాల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వివిధ ఆదాయ వనరుల వేలంపాట ద్వారా పంచాయతీకి గణనీయమైన ఆదాయం లభించింది. స్థానికంగా నిర్వహించే వీక్లీ మార్కెట్ హక్కులను పి. చిదానంద చౌదరి రూ. 22,65,000లకు దక్కించుకున్నారు. రోజువారీ మార్కెట్ హక్కులను డి. సురేష్ రూ. 12,05,000లకు పొందగా, ప్రైవేట్ బస్టాండ్‌ను డి. మోహన్ నాయుడు రూ. 1,26,000లకు సొంతం చేసుకున్నారు. అదేవిధంగా స్లాటర్ హౌస్‌ను సి. చెన్నకేశవ రెడ్డి రూ.58,000లకు తీసుకున్నారు. కొబ్బరి చెట్లు బి. జగదీష్ రూ.4,000లకు, చింతపండు చెట్లు కె. శరత్‌కుమార్ రూ.3,500లకు దక్కించుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడు పంచాయతీ గదులను ఎం దేవి, వి కృష్ణయ్య, వి వేలు లకు నెలవారీగా (రూ.4,550, రూ. 4000, రూ.4450 చొప్పున) లీజ్‌కు ఇచ్చారు. ఈ మొత్తం వేలం పాట ద్వారా పంచాయతీకి సుమారు రూ.36,74,500 (ముప్పై ఆరులక్షలడెబ్బై నాలుగు వేల ఐదు వందల రూపాయలు) ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

## నేడే ఉచిత కంటి వైద్య శిబిరం

వడమాలపేట, మార్చి 28 ప్రభాతవార్త:

తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వడమాలపేట ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారని, ఆపరేషన్‌కు ఎంపికైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించే శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ తీసుకురావాలని తెలిపారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తు న్నామని, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పురుషోత్తం రెడ్డి కోరారు.

## మామిడి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

వడమాలపేట, మార్చి 28 ప్రభాతవార్త:



రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శనివారం వడమాలపేట మండలం బొమ్మరాజుపురం, ఎస్‌వీ పురం గ్రామాల్లోని మామిడి తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ జనవరి ఆఖరివారం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు వచ్చిన పూత పిందె కట్టి సుమారు 150-200 గ్రాముల బరువు పెరిగిన దశలో ఉన్నాయని చెప్పారు. తరువాత ఫిబ్రవరి రెండవ పక్షంలో ఆలస్యంగా వచ్చిన పూత అధిక పగటి ఉష్ణోగ్రత, చల్లటి రాత్రి ఉష్ణోగ్రతలు వలన పురుగు, తెగుళ్ల ఉధృతి పెరగడంతో పాటు లేత చిగురు రావడం కారనంగా పిందె సరిగా కట్టలేదన్నారు. అంతేగాక ఆ సమయంలో పురుగు, తెగుళ్ళ తీవ్రతను గుర్తించి సరైన సస్యరక్షణ మందులను వినియోగించక పోవడం కూడా పూత, పిందె రాలిపోవడానికి కారణమని ఆయన తెలిపారు. ప్రస్తుతం అధిక నాణ్యమైన కాయదిగుబడికి పాటించవలసిన మెళకువలు గూర్చి రైతులకు వివరించారు. ప్రస్తుతం పుచ్చకాయ, నిమ్మకాయ దశలో ఉన్న మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, పచ్చ పురుగు నల్ల మచ్చ తెగులు నివారణకు అసిఫేట్ ప్లస్ బుప్రఫెజిన్ 1.5 గ్రా హెక్సాకొనజోల్ 2 మిలీ మల్టి-కె 10 గ్రాములు, సూక్ష్మ పోషక మిశ్రమాన్ని 5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ సమయంలో సరిపడ నీటి తడులనివ్వాలన్నారు. ఫ్రూట్ కవర్స్ 150 గ్రాముల కాయ దశలో ఉన్నప్పుడు తొడగడం వలన పండు ఈగ, నల్ల మచ్చ తెగులను సమర్థవంతంగా నివారించుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, అనిల్‌కుమార్, రాస్ ప్రాజెక్టు సిబ్బంది, సాయిచంద్రబాబు, నీరజ్, మామిడి రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీ వేలంకు నామమాత్రపు స్పందన

నిర్ధేశించిన ధరలకు పోటీదారులు వెలవెల

చంద్రగిరి, మార్చి 28 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామపంచాయతీ నిర్వహించిన వేలం పాట నామమాత్రపు స్పందనతో ముగిసింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి అధ్యక్షతన, ఎంపిడిఓ అమర్‌నాథ్ రెడ్డి పర్యవేక్షణలో ఈఓ చంద్రశేఖర్ రెడ్డి వారపు సంత, బస్టాండ్, కసాయి మార్కెట్, వాటర్ ప్లాంట్‌లకు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వారపు సంతకు రూ.24 లక్షలు ధర నిర్ణయించగా కాపువీధి సునీల్ రూ.5 వేలు హెచ్చుతో దక్కించుకున్నారు. అదేవిధంగా ప్రైవేటు బస్టాండ్‌కు రూ.7.50 లక్షలు నిర్ణయించగా వెంకటరెడ్డి రూ.2 వేలు హెచ్చుతో దక్కించుకున్నారు. జంతువధశాల రూ.1,95,000/-లకు మహ్మద్‌భాషా దక్కించుకున్నారు. గాండ్లవీధి వాటర్ ప్లాంట్ కె.మనోహర్ రూ.30,100/-లకు, ధర్మరాజుల గుడి వద్ద గల వాటర్ ప్లాంట్ యు.చరణ్ రూ.50 వేలతో దక్కించుకున్నారు. పంచాయతీ నిర్ధేశించిన ధరల పట్ల పోటీదారులు వెలవెలబోయారు.

# తిరుపతి డివిజన్

## అమర ఆసుపత్రిలో హృద్రోగులకు అత్యుత్తమ వైద్యం......

రేణిగుంట మార్చి 28 ప్రభాతవార్త



రేణిగుంట మండలం కరకంబాడి (తిరుపతి) అమర ఆసుపత్రిలో గుండె సంబంధిత రోగులకు అత్యుత్తమమైన సేవలు అందిస్తున్నామని డాక్టర్ శివకృష్ణ అన్నారు. అమర ఆసుపత్రిలో ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర్ నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అమర ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ సిమ్స్ ఆసుపత్రి నందు కార్డియాలజీ విభాగం అధిపతి, డీన్ గా సేవలు అందించిన అపూర్వ అనుభవం ఉందని తెలిపారు. ఆయన విధులలో చేరడంతో అమర ఆసుపత్రి కార్డియాలజీ విభాగం నందు గుండె సంబంధిత వైద్య సేవలు బలోపేతం అయ్యాయన్నారు. సీనియర్ కార్డియాలజీ కన్సల్టెంట్ గా బాధ్యతలు స్వీకరించడం శుభపరిణామంగా అభివర్ణించారు. అత్యవసర గుండెపోటు చికిత్సలు, యాంజియోగ్రామ్, యాంజియో ప్లాస్టి వంటి కీలక గుండె సంబంధిత చికిత్సలు సులభతరం అయ్యాయన్నారు. అత్యాధునిక నిర్ధారణ పరికరాలతో నిష్ణాగరిస్తులైన వైద్యుల సమక్షంలో సేవలు అందించడం అమర ఆసుపత్రి ప్రత్యేకతగా తెలిపారు. అమర ఆసుపత్రి నందు అత్యవసర సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. ఏకకాలంలో అన్ని రకాల వైద్య సేవలు అందించగలిగే ట్రామా బృందం అమర ఆసుపత్రిలో ఉందన్నారు. సమావేశంలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వెంకటకృష్ణ, డాక్టర్ నౌషాద్, డాక్టర్ ఖ్వాజా ఖాబేదుల్లా షేక్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వేణుగోపాల్, విజయ్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మునినాదం తదితరులు పాల్గొన్నారు..

## అమరావతి రాజధాని కావడానికి రైతులే కారణం

రేణిగుంట మార్చి 28 ప్రభాతవార్త



నవ్యాంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని కావడానికి రైతులే ప్రధాన కారకులని బి ఎం ఎస్ జిల్లా కార్యదర్శి, బిజెపి యువనేత పూల వెంకటాద్రి యాదవ్ అన్నారు. సన్న చిన్న కారు రైతుల త్యాగాల ఫలితమే నేటి అమరావతి రాజధాని అని ఉద్ఘాటించారు. అమరావతి రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం ప్రకటించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు న్యాయబద్ధంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని రైతుల రాజధాని అని రాజముద్రతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించడం సంతోషమని అన్నారు. రాష్ట్ర విభజన చేసిన అప్పటి కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్లో డిపాజిట్ లేకుండా పోయిందని అన్నారు.

## పూర్వ విద్యార్థులు మార్గదర్శకులు: ప్రిన్సిపల్ నాదమునిరెడ్డి

రేణిగుంట, మార్చి 28 ప్రభాతవార్త




పూర్వ విద్యార్థులు రాబోయే విద్యార్థులకు మార్గదర్శకులు కావాలని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదముని రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. సమ్మేళనాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదముందు రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్ రెడ్డి, పూర్వ విద్యార్థుల కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్, ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ భాను ప్రకాష్ వాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాదముని రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు రాబోయే తరాలకు మార్గదర్శకులు కావాలని పిలుపునిచ్చారు. వారి ప్రవర్తన కొత్త విద్యార్థులపై ఉంటుందన్నారు. నూతన విద్యార్థులు మంచిని గ్రహించేలా పూర్వ విద్యార్థులు ప్రవర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులతో పాటు వివిధ విభాగాల హెచ్‌ఓడీలు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## టీటీడీ పరిపాలన భవనం దగ్గర కాంగ్రెస్ ధర్నా

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్

తిరుపతి, మార్చి 28 ప్రభాతవార్త




టీటీడీలు పనిచేసే ఉద్యోగస్తులకు పిఆర్సి, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలు, ప్రమోషన్లు ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం టిటిడి పరిపాలనా భవనం దగ్గర కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీలో పనిచేసే ఉద్యోగస్తుల పరిస్థితి చాలా దీనాతి దీనంగా ఉందన్నారు. పిఆర్సి అమలు కావడం లేదన్నారు. గత నాదగేలుగా డిఏలు పెండింగ్లో ఉందన్నారు. పది సంవత్సరాలుగా ప్రమోషన్లు ఆగిపోయిందన్నారు. గత పది సంవత్సరాల కాలంలో టీటీడీకి ఎంతోమంది ఈవోలు వచ్చారు. పోయారు. కానీ సమస్యలు అలాగే ఉందన్నారు. ప్రస్తుతం టీటీడీకి మంచి ఆఫీసర్లు రావడం సంతోషమన్నారు. టీటీడీ ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగస్తులు దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. ధార్మిక సంస్థలో ఎన్నో అధర్మాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలు పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని, వీరందరూ ప్రతిరోజూ కన్నీళ్లతో ఇళ్లకు వెళ్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు మహిళా కార్మికులను క్షోభకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ మహిళా కార్మికుల నుంచి మాకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కాంట్రాక్ట్ విధానాన్ని మార్చాలని, లేదా కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో ఉన్న నిరుపేద రోగుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. మంచి వైద్యం అందక, ఎంతోమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలిపిరి దగ్గర ఉన్న టిటిడి బిల్డింగులు రుయా ఆసుపత్రికి ఇవ్వాలని కోరారు. స్విమ్స్ లో ఉచిత వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధిలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు



బాలాయపల్లి, మార్చి 28 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లి స్త్రీ శక్తి కార్యాలయ ఆవరణలో 17వ బహిరంగ సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. 903 రకాల పనులకు కూలీలకు 11 కోట్ల 17 లక్షల 96 వేల 51 రూపాయల వేతనాలు, చెల్లించామని మెటీరియల్‌కు 39 కోట్ల 84 లక్షల 93 వేల 376 రూపాయలు, మొత్తం 15 కోట్ల 16 లక్షల 45 వేల 427 రూపాయల పనులకు ఆడిట్ జరిగినట్లు పి.డి.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. కొన్ని పంచాయతీల పనులలో జరిగిన అవినీతిని ప్రజా వేదిక పి.డి తెలిపారు. కొన్ని పంచాయతీలలో గతంలో చేసిన పనులకు కూడా మరల బిల్లులు పెట్టి నగదు స్వాహా చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. పంచాయతీలో ఫారం పొందు నగదు, కూలీల నగదు నిండలి ఫీల్డ్ అసిస్టెంట్ స్వాహా చేసినట్లు కొంతమంది గ్రామస్తులు పిడికి ఫిర్యాదు చేశారు. గతంలో కంటే నేటి ఆడిట్లో 80 అక్రమాలు తగ్గినట్లు పీడీ తెలిపారు. భూమన యాప్ ద్వారా ఏప్రిల్ నుంచి ఉపాధి హామీ పథకంలో భారీ మార్పులు వస్తున్నట్లు తెలిపారు. పంచాయతీలలో చిన్న పనులు చేయకుండా పెద్ద పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా కూలీలకు ఒక ఏడాది పాటు పని లభిస్తుందని తెలిపారు. గతంలో అక్రమాలకు పాల్పడిన కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించామన్నారు. 24 పంచాయతీలలో అవినీతిని పాల్పడిన ఎఫ్ఏలు టిఏ నుండి రూ.2,18,031 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు.

ఈ ఉపాధి హామీ ప్రజావేదికలో ఎంపిడిఓ నారాయణ ఏపీడి ప్రసాద్, ఏపీవోలు గణేష్ కుమార్, జ్యోతి, మృత్యుంజయ, ఎస్ఆర్పి వెంకయ్య, డిఆర్పిలు, ఎఫ్ఎలు, టీఏలు, మండల పార్టీ అధ్యక్షులు రావి సత్యం నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కమిషనర్



సూళ్లూరుపేట, మార్చి 28 ప్రభాతవార్త : పర్యావరణ పరి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రత్యేక అధికారి కె.దేవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు 'జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్కువీధిలోని మండల ప్రజాపరిషత్ పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలలో చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయాల్సిన అవసరాన్ని కమిషనర్ చిన్నయ్య వివరించారు. గ్రీన్‌బిన్, బ్లూబిన్, రెడ్‌బిన్ వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డుశానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## దుగ్గరాజపట్నంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్



వాకాడు, మార్చి 28 ప్రభాతవార్త: మండలం దుగ్గరాజపట్నంలో ఉన్న మెరైన్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ శివ సౌమ్య, మెరైన్ పోలీస్ సిబ్బంది శనివారం ఆ ప్రాంతంలోని స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా దుగరాజపట్నం పరిధిలో ఉన్న మెరైన్ పోలీస్ స్టేషన్ ఆవరణం పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా చేయడం జరిగిందన్నారు. చెత్త చెదారం శుభ్రం చేయడం జరిగిందన్నారు. వ్యర్థ పదార్థాలతో పాటు ప్లాస్టిక్ తదితర ఆ ప్రాంతంలో పరిస్థితులపంగా చేయడం జరిగిందన్నారు.

## విద్యుత్ దీపాల వెలుగులో అక్కరపాక గ్రామం



దొరవారిసత్రం, మార్చి 28 ప్రభాతవార్త : మండలం పరిధిలోని శనివారం అక్రపాక గ్రామ సర్పంచ్ కామిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యం నేషనల్ హైవే నుంచి అక్కరపాక గ్రామంలోకి తన సొంత నిధులతో వెచ్చించి 20 స్తంభాలకు విద్యుత్ లైట్లు సుమారు లక్ష 50 వేల రూపాయల వ్యయంతో విద్యుత్ పేగులను నింపారని గ్రామ ప్రజలు కొనియాడారు.

## పేట పోలేరమ్మ హుండీ లెక్కింపు



నాయుడుపేట, మార్చి 28 ప్రభాతవార్త: గ్రామదేవత శ్రీ పోలేరమ్మ హుండీ ఆదాయం మూడు నెలల 11 రోజులకు గాను నాలుగు లక్షల పదివేల 471 రూపాయిలు హుండీ ఆదాయం జమైనట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ నాన బాల సుబ్బారావు, గ్రామ పెద్దలు ఆకుల కుబేరుమని, గిరి. నల్లబోతుల రవి, ఆధ్వర్యంలో మొదటగా అమ్మనికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామ మందిరం వద్ద ఏర్పాటుచేసిన సీతారాముల కళ్యాణోత్సవ మండపంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. నెల్లూరు సేవా సమితి సభ్యులను లెక్కింపు ప్రక్రియకు వినియోగించారు. ఈ కార్యక్రమంలో భాను శెట్టి, చిట్టిబాబు శెట్టి, విశ్రాంత ఎస్ఐ శ్యాము, చిరంజీవి శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలుపై కళాజాతాల ప్రదర్శన



బాలాయపల్లి, మార్చి 28 ప్రభాతవార్త: బాల్య వివాహాలు అనర్ధమని పెరిమిడి, గొట్టికాడు అంగన్వాడి కేంద్రాల్లో కళాజాతాలు నిర్వహించారు. వివాహాలు చేయడం వల్ల బాలికలు అనారోగ్య ఫాలో అవుతారని తెలిపారు. తల్లిదండ్రులకు బాలవిహాల అనర్ధాలపై ప్రదర్శన నిర్వహించారు. బాల్యవాహాలు చట్టరీత్యా నేరం అని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో



వాకాడు, మార్చి 28 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు ఎస్ఏఎల్‌సి ప్రభుత్వ ప్రధాన పాఠశాల ఆవరణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ కోరారు. శనివారం వాకాడు ప్రభుత్వ పాఠశాల నందు ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా నిషేధిత పరికరాలను తొలగించడంతోపాటు, వ్యర్థ పదార్థాలతోపాటు, ప్లాస్టిక్, రోడ్లకి ఇరువైపులా పరిశుభ్రంగా చేసుకోవాలని అన్నారు, విద్యార్థిని విద్యార్థులు చదువుతున్న ప్రదేశంలో పాఠశాల ఆవరణంలో ఎలాంటి అసౌక్రియ గద్ద పదార్థాలను ఎప్పటికప్పుడు పరిశ్రమంగా చేసుకోవాలని సూచించారు, సిబ్బంది ప్లాస్టిక్ నిషేధం ఉన్న కూడా పరిశుభ్రంగా చేసుకోపోతే తగిన చర్యలు తీసుకుంటాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆదర్శంగా పాలన అందిస్తున్న ప్రధానమంత్రి

**- బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు**



వెంకటగిరి, మార్చి 28 ప్రభాతవార్త: దేశంలో అవినీతి లేని పరిపాలన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందిస్తున్నారని బిజెపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో పండిట్ దీనదయాలు ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వాల్లో పెద్ద పెద్ద కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. 2014వ సంవత్సరం నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలకే ఆదర్శంగా పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. నరేంద్ర మోడీ జీవితాంతం ప్రధానమంత్రిగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, కార్యదర్శి పార్థసారథి, పాటలు పార్టీ అధ్యక్షులు పాలా కృష్ణమూర్తి, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## గడ్డి వామి దగ్ధం

బాలాయపల్లి, మార్చి 28 ప్రభాతవార్త: మండలంలోని మేల్చూరు గ్రామానికి చెందిన పుత్తూరు శంకరయ్య గడ్డివాము, రేకు ఇల్లు, ఇంటిలోని వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదం కారణంగా దాదాపు 10 లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. ఇల్లు దగ్ధం అయినందున కట్టుబట్టలతో గుడుంబా సభ్యులు మిగిలామని తెలిపారు. ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.

## తాజా మాజీ కౌన్సిలర్లకు సన్మానం

వెంకటగిరి, మార్చి 28 ప్రభాతవార్త: ఈ నెల 17వ తేదీతో మున్సిపాలిటీ కౌన్సిలర్ పదవీకాలం ముగియడంతో వారిని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఈనెల 29వ తేదీ ఆయన నివాస గృహంలో సత్కరిస్తారని పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వారి సేవలను కొనియాడుతూ రాంకుమార్‌రెడ్డి సత్కారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 25 వార్డులుగా అందరూ వైసిపి వారే విజయం సాధించారు. చైర్ పర్సన్‌పై అయస్కార్ తీర్మానం పెట్టగా రాంకుమార్ రెడ్డి చాకచక్యంగా వీగిపోయేటట్టు చేశారు. రాష్ట్రాల్లో ఎక్కడ జరగని విధంగా ఒక వెంకటగిరి లోనే అవిశ్వాస తీర్మానం విరిగిపోయింది. దీంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి,రాంకుమార్ రెడ్డిని అభినందించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారందరూ ఒకే తాటిపై నిలబడడంతో కౌన్సిలర్లను రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. అందర్నీ సత్కరించాలని ఆయన నిర్ణయించినట్లు తెలిపారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి ఊంజల్‌సేవ



వడమాలపేట, మార్చి 28 ప్రభాతవార్త: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారికి శనివారం ఊంజల్‌సేవ, మాడవీధుల ఉత్సవం వైభవంగా జరిగింది. శనివారం వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చారు. స్వామివారు గంటపాటు సద్విలాసంగా ఊయలలుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడా వీధుల్లో విహరించారు. స్థానిక భక్తులు ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు శరాబ్ రవీంద్ర, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కోదండ రామలవారి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం

**వైభవంగా శ్రీరామనవమి మహోత్సవాలు**





చంద్రగిరి, మార్చి 28 ప్రభాతవార్త: టిటిడి అనుబంధ శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో శనివారం ధ్వజారోహణం ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చంద్రగిరిలోని చారిత్రాత్మక పురాతన శ్రీకోదండరామ స్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుండి 8.45 గంటల మధ్యన వృషభలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఆలయ కంకణభట్టార్ శ్రీనివాస భట్టార్ ఆధ్వర్యంలో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల రామనామ స్మరణల నడుమ ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై అధిష్టింపజేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు శ్రీసీతారాముల వారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో 6 గంటల నుండి 7 గంటల వరకు శ్రీసీతారాముల ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దినేష్, ఓఎస్‌ఓలు బెల్లంకొండ ప్రసాద్, రామకృష్ణ, పరిచారిక రామాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

## మఠాలు,సత్రాలపై మున్సిపల్ కొరడా



శ్రీకాళహస్తి,మార్చి 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పన్నుల వసూళ్ళపై కమిషనర్ భవాని ప్రసాద్ ప్రత్యేక దృష్టి పెట్టారు. మొత్తం డిమాండ్ రూ.11కోట్లు కాగా ఇప్పటికే శనివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు రూ.8.4కోట్లు వసూలు చేసినట్లు సమాచారం.గత నెల రోజులుగా కమీషనర్ భవాని ప్రసాద్ సిబ్బందిని పరుగులు తీయిస్తున్నారు. ఈ నేపధ్యంలో గతంలో పన్నుల వసూళ్ళకు సంబంధించి అధికారులు నిర్లక్ష్యం చేసారు. దాంతో బకాయిలు పెచ్చు పెరిగాయి. ఈ ఏడాది కమిషనర్ భవాని ప్రసాద్ కొరడా ఝుళిపించారు. ముఖ్యంగా నాలుగు మాడా వీధుల్లో మఠాలు,సత్రాలపై దృష్టి సారించారు. తేరువీధిలోని ఓ మఠంకు తాళాలు తగిలించారు. శనివారం బజారువీథిలోని ఓ సత్రం వద్ద మున్సిపల్ సిబ్బంది అందరూ చేరుకున్నారు.పెద్ద మొత్తాల్లో ఉన్న పన్నులను వసూలు చేయటంలో సిబ్బందిని పరుగులు తీయించటమే కాకుండా ఆయనే స్వయంగా ఇంటి యజమానుల వద్దకు వెళ్లి వసూలు చేస్తున్నారు.మూడు రోజులుగా ప్రతి రోజూ రూ.15లక్షలకు తగ్గకుండా వసూలు చేస్తున్నారు.ఇక కొళాయి పన్నులు బకాయి ఉన్న వారిపై ప్రత్యే దృష్టి సారించారు.ఈ నేపధ్యంలో బజారు వీధిలోని ఓరుగంటి చెంగయ్యశ్రేష్టి సత్రం రూ.1,58,353లు చెల్లించాల్సి ఉంది. ఈ సత్రం నిర్వాహకులు 2022 నుంచి చెల్లించక పోవటంతో కఠినంగా వ్యవహరించారు.ఈ దాడుల్లో రెవెన్యూ అఫీసర్ ఎం.చంద్రకాంత్, రెవెన్యూ ఇన్సెపెక్టర్ సోమశేఖర్, సచివాలయ సిబ్బంది తస్లీం వారి సహచరులు పాల్గొన్నారు. ఎలాగైనా నెలాఖరుకు 95 శాతం వసూలు చేయాలని కమిషనర్ సిబ్బందిని పరుగులు తీయిస్తున్నారు.

# ఆరు నెలల బిడ్డని చంపిన తల్లి అరెస్టు



సత్యవేడు, మార్చి 28 ప్రభాతవార్త: సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కూతురుని చంపిన కేసులో నిందితురాలు తల్లి హేమావతి(28)ని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ మురళీనాయుడు అధ్యక్షతన నిందితురాలు హేమావతిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తల్లి స్వయాన నవశిశువుని చంపిన కేసుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. నరసరాజు అగ్రహారం పంచాయతీ పరిధిలోని పద్మప్రియ ఇంటిసముదాయంలో మొదటి అంతస్తులు వెంకటేష్, హేమావతి దంపతులు కుటుంబం నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితమే తమిళనాడు, గుమ్మడిపూండి తాలూకా చిన్నబొమ్మాజీ గుంట గ్రామం నుంచి బతుకు తెరువు కోసం ఇక్కడికి వచ్చి చేరారు. నిందితురాలు హేమావతి భర్త వెంకటేష్ సమీపంలోని సిమెంటు ఇటుకల తయారీ కేంద్రంలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో పద్మప్రియ గృహ సముదాయంలోకి వచ్చిన ఒక నెల కంత ఆడబిడ్డ జోవిక జన్మించింది. అయితే కూతురు జన్మించిన తరువాత హేమావతి ప్రవర్తనలో మార్పు వచ్చింది. అధికమైన కోపం పని ఒత్తడి పెరిగిపోవడం, తరచూ కూతురు ఏడవడం వంటివ ఇచోటు చేసుకోవడంతో భర్త వెంకటేష్ ఏది చెప్పినా ఇంట్లో ఉన్న పాత్రలను పగులగొడుతూ వచ్చింది. పైగా కూతురు జోవిక జన్మించిన మొదలు ఏడుస్తూనే ఉండడంతో తల్లి విరక్తి చెందడంతో పాటు ఎందుకు పట్టించుకున్నామా అంటూ బాధపడుతూ వచ్చింది. దీనిపై మానసిక శాంతి లోపించడంతో తల్లి కోపిస్టిగా మారిపోయింది. ఎలాగైనా కూతుర్ని వదిలించుకోవాలని మనసులో డిసైడ్ అయిపోయింది. కూతురుని ఎక్కడైనా వదిలేసి వచ్చేయాలంటూ పలుసార్లు భర్తకు చెప్పినఆ వినిపంచుకోలేదు. పక్కనున్న కుటుంబాల సైతం హేమావతి ప్రవర్తనను గమనించి మందలించి వెళ్లేవారు. ఈ నేపథ్యంలోనే కోపోద్రిక్తులైన తల్లి హేమావతి 2026 మార్చి 26వ తేదీ ఉదయం 7 గంటల సమయంలో భర్త వెంకటేష్ పనికి వెళ్లిపోవడంతో కూతురు ఏడుస్తూ ఉండడంతో కోపం విపరీతంగా పెరగడంతో ఇంట్లో బెడ్‌పై పడుకున్న కూతురు జోవిక ముక్కు, నోరు అదిమిపెట్టి చంపేసింది. దీనిపై భర్త వెంకటేష్ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ సాయినాథ్ చౌదరి కేసునమోదు చేయడం జరిగింది. కేసు విచారణను సీఐ మురళీ నాయుడు చేపట్టారు. గ్రామ పెద్దలు కొందరు హేమావతిని పోలీస్‌స్టేషన్‌కి పిలుచుకుని రావడంతో మార్చి 27వ తేదీ రాత్రి 8 గంటలసమయంలో నిందితురాలను అరెస్టు చేశారు. తమిళనాడు తిరువళ్లూరు జిల్లా నెమలిచేరి గ్రామానికి చెందిన హేమావతితో 7 సంవత్సరాల క్రితం వెంకటేష్‌తో వివాహం జరిగింది. కొంతకాలం అమ్మగారి ఇంట్లోనే వీరు నివసించిన తరువాత భర్త వెంకటేష్ స్వగ్రామమైన చిన్నబొమ్మజిగుంట గ్రామానికి తరలివెళ్లి కాపురం పెట్టారు. తదుపరి ఎన్ఆర్ అగ్రహారం గ్రామంలోకి వచ్చి చేరారు. కూతురుని చంపేస్తే మన శాంతితో ఉండవచ్చునన్న ఒక ఏకైక కారణంతోనే ఉద్దేశపూర్వకంగా కూతురిని తల్లి చంపేసినట్లు విచారణలో తేలిందని ఈ సందర్భంగా సీఐ స్పష్టం చేశారు.అరెస్టు చేసిన నిందితురాలు హేమావతిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కి విధించినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో స్థానిక ఎస్ఐ సాయినాథ్‌చౌదరి, లావణ్యలు ఉన్నారు.

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలిరండి



చిట్వేలి, మార్చి 28 ప్రభాతవార్త: టిడిపి 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక నూతన బస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నేడు అనగా ఆదివారం ఉదయం నిర్వహించనున్న ఆవిర్భావ వేడుకలకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని టిడిపి మండల బాధ్యుడు కాకర్ల నాగార్జున పిలుపునిచ్చారు. పలు గ్రామాలలో జెండా ఆవిష్కరణ, పెద్ద ఎత్తున ర్యాలీ, తదుపరి ఆవిర్భావ వేడుకలు చేపట్టనున్నట్లు తెలిపారు. పలువురు ప్రముఖులు విచ్చేస్తున్న ఈ కార్యక్రమానికి నాయకులు, క్లస్టర్లు, కోక్లస్టర్లు, బూత్ లెవెల్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాకర్ల కోరారు.

## విద్యార్థుల భాగస్వామ్యంతో...స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర

**-తిరుపతి కమిషనర్ మౌర్య**



తిరుపతి,మార్చి 28ప్రభాతవార్త: స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో విద్యార్థుల భాగస్వామ్యంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్వీయు ఆడిటోరియం వద్ద జీరో వేస్ట్ ఇన్నిట్యూటీన్స్ ఆశయంతో చెత్త నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రీనరీ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఎస్వీయు రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, పాల్గొని చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎస్వీయు లైబ్రరీ వద్ద పరిసరాలు శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనవరి 2025 నుంచి ప్రతినెల మూడవ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపుమేరకు ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జీరో వేస్ట్ ఇన్నిట్యూషన్ థీమ్‌తో యూనివర్సిటీలో చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గత ఏడు సంవత్సరాల ముందు నుండి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామని తెలుప్పారు. అయినా పలు చోట్ల వినియోగం జరుగుతోందని తెలిపారు. ఇన్నిట్యూషన్ లోని విద్యార్థుల్లో మార్పు వస్తే ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిర్మూలించవచ్చునని తెలిపారు. మన దగ్గర ఉత్పత్తి అయ్యే చెత్తను మనమే నిర్వహణ చేస్తే మనం మొక్కలకు వినియోగించవచ్చునని తెలిపారు. పొడి చెత్త రిసైకిల్ చేయించాలని తెలిపారు. జీరో వేస్ట్ కొరకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఫోర్ బిన్ సిస్టం ద్వారా తడి, పొడి, ప్రమాదకర వ్యర్తాలు, ఈ వేస్ట్ అనే నాలుగు రకాలుగా చెత్త ను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను హోమ్ కంపోస్ట్ చేసి మొక్కలకు ఎరువుగా వినియోగించుకునేలా విద్యార్తులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియేన్సీలో భాగంగా ఎల్.ఈ.డి. లైట్స్ వినియోగించడం, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వంటివి చేయాలని తెలిపారు. తద్వారా ఎనర్జీ వినియోగం తగ్గి పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. స్ట్రీట్ ప్లే చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేడుకుందామా వేంకటపతిని

### -వైభవంగా నగరసంకీర్తన



తిరుపతి,మార్చి 28ప్రభాతవార్త: తిరుపతి పురవీధులు గోవింద నామాలతో మార్మోగాయి. తిరుపతి క్షేత్రంలో అడుగడుగునా భక్తి భావం పెంపొందించాలన్న సంకల్పంతో స్థానిక భజన మండలి కళాకారులు శ్రీవారికి ఎంతో ఇష్టమైన శనివారం రోజున నగర సంకీర్తన చేస్తున్నారు. వందమందికి పైగా భజన మండలి కళాకారులు ప్రతి శనివారం ఉదయం ఐదు గంటలకి సాంప్రదాయ సాంప్రదాయ వస్త్రాలతో నుదుటిపైన గోవింద నామాలతో స్థానిక గోవిందరాజస్వామి ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ తిరు వీధులలో నగర సంకీర్తన చేస్తు నగరంలో ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తున్నారు. నగర సంకీర్తన అనంతర అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు మునప్పగారి మునినాథ రెడి ,గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఎల్ కృష్ణయ్య,విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, మధు, వాసుదేవ రెడ్డి, నరసింహారెడ్డి,పొన్నాల జేజిరెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, మురళి, తొండము నాటి సుబ్రహ్మణ్యం,తులసి రామ్ నాయుడు, పార్వతి, సిద్ధమ్మ, అరుణ, జయమ్మ, పద్మావతి,విగ్రహాల కళ్యాణి, వెంకట్రామయ్య, నాగేశ్వర్ రెడ్డి, పురుషోత్తం యాదవ్,నాగరాజు చంద్రబాబు నాయుడు ,మల్లారపు వాసు తదితరులు పాల్గొన్నారు

## రేపు పద్మావతి వర్సిటీలో పి 4

యూనివర్సిటీ(తిరుపతి), మార్చి 28ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు సోమవారం తిరుపతి జిల్లాకు సందర్భంగా మందస్తు భద్రత ఏర్పాట్లను పట్టిష్టంగా ఏర్పాటు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పి 4 కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపటాలని ఆదేశించారు. శనివారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పై ఎస్పీ సుబ్బరాయుడు, డిఆర్ఓ నరసింహులు, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, పిడిసి గీతాంజలి, ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్‌తో కలిసికలెక్టర్ ఏర్పాట్లపై సమీక్షించాం

### గ్రామపంచాయతీ కార్యాలయము,రామకుప్పం

రె.క.నెం.ఎ/01/2026 **బహిరంగ వేలము ప్రకటన** తేది : 02-03-2026

నిర్దేశము :1. గ్రామపంచాయతీ తీర్మానము నెం. 143, తేది 27/02/2026.
2. గ్రామ పంచాయతీ రె.క నెం.03/2026 తేది 27-02-2026.
3. శ్రీ డివిజనల్ పంచాయతీ అధికారి గారి రె.క.నెం.ఎ/01/2026, తేది 02-03-2026

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ప్రభుత్వ ఉత్తర్వు నెం. 496 పంచాయతీరాజ్‌శాఖ, తేది 11-06-1966లోని నియమావళి 5బి ద్వారా సంక్రమించిన అధికారములను పురస్కరించుకొని రామకుప్పం గ్రామ పంచాయతీకి చెందిన ఈ క్రింద వివరించిన గుత్తలను 2026-27 కాలపరిమితికి అనగా 01-04-2026 నుండి 31-03-2027 వరకు గుత్తలను అనుభవించుకొను హక్కులకు 30-03-2026వ తేదీ సోమవారం ఉదయం 11 గం.లకు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు గ్రామ పంచాయతీ సర్పంచ్ వారి అధ్యక్షతన, డివిజనల్ పంచాయతీ అధికారి వారి ఆధ్వర్యంలో వేలము నిర్వహించబడును. వేలము నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింద కనబరచిన మేర డిపాజిట్లను 30-03-2026 ఉదయం 11గం.లోపు నగదు రూపంలో పంచాయతీ కార్యదర్శి, రామకుప్పం గ్రామ పంచాయతీ వారి పేర సమర్పించవలెను. వేలంలో పాల్గొను వారు సాల్వెన్సీ సరిఫికేట్‌తో సహ క్రింది కనిన డిపాజిటలన చెల్లించి వేలంలో పాల్గొనవలెను.

| వ. నెం. | గుత్త వివరములు | సాల్వెన్సీ వున్న వారు చెల్లించవలసిన డిపాజిట్ రు.లు | సాల్వెన్సీ విలువ రూ.లు | సాల్వెన్సీ లేని వారు చెల్లించవలసిన డిపాజిట్ రు.లు |
|---|---|---|---|---|
| 01. | వారపు సంత | 2,00,000/- | 2,00,000/- | 2,00,000/- |
| 02. | దినసరి కూరగాయల మార్కెట్ | 50,000/- | 50,000/- | 50,000/- |
| 03. | ప్రైవేట్ బస్టాండ్ | 1,50,000/- | 1,00,000/- | 1,00,000/- |
| 04. | షాపింగ్ గదులు -3 | 30,000/- | - | 30,000/- |
| 05. | చికెన్ గదులు -6 | 10,000/- | - | 10,000/- |

షరతులు:- (1) వేలములో పాల్గొను వారు క్రిమినల్ నేరం క్రింద శిక్షపడినవారు కానీ, ఇ.పి పెట్టిన వారు కానీ పాటలో పాల్గొనుటకు వీలుపడదు. 2) హెచ్చు పాటదారుడు వేలం జరిగిన తేది నుండి 3 రోజుల లోపల వేలం పాట మొత్తం డిపాజిట్ పోను మిగిలిన పైకమును ఏక మొఉత్తం ఏకకాలంలో చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల డిపాజిట్‌ను పంచాయతీకి దండుగ పద్దు క్రింద జమ చేసుకొని తదుపరి మరు వేలము నిర్వహించబడును. అట్లు మరు వేలంలో పంచాయతీకి నష్టం వాటిల్లిన మొదటి హెచ్చు పాటదారుని వద్ద నుండి పైకము రాబట్టుటకు చట్ట పరమైన చర్యలు తీసుకొనబడును. 3) వేలంలో డిపాజిట్‌దారుడు కాకుండా అతని తరపున ఆథరైజ్ వ్యక్తుఃఉ అనుమతించబడరు. 4) వేలంలో పాల్గొను వారు పంచాయతీకి ఎలాంటి పన్నులు గానీ, పాత బాకీలు గానీ వుండరాదు. 5) హెచ్చు పాటదారుడు ఇండియన్ స్టాంపు డ్యూటీ చట్టం ప్రకారము హెచ్చు పాటవేలం మొత్తం నగదుకు అదనంగా 3శాతం స్టాంపు డ్యూటీ చెల్లించవలెను. 6) హెచ్చు పాటదారుడు తన స్వంత ఖర్చులతో ఇండియన్ స్టాంపు పేపరు పైన పంచాయతీ వారితో అగ్రిమెంట్ కుదుర్చుకొని రిజిస్ట్రేషన్ చేయించుకొనవలెను. 7) వేలం ఖాయపరచుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ మరియు రద్దు పరచుటకుగానీ కార్యనిర్వహణాధికారి వారికి పూర్తి అధికారం కలదు. 8) మరువేలం కోరువారు వేలం ముగిసిన సమయం తరువాత 24గం॥లోపు వేలం మొత్తానికి 10శాతం అదనంగా చేర్చి మొత్తం పైకం చలానా రూపేణా గ్రామ పంచాయతీకి చెల్లించి, మరు వేలం అర్జీని పంచాయతీ కార్యదర్శికి అందజేయవలెను. 9) సదరు వేలం డివిజనల్ పంచాయతీ అధికారి మదనపల్లె, లేక వారి అనుమతి పొందిన వారి ఆధ్వర్యంలో జరుపబడును. 10) వేలం డిపాజిట్‌దారుడు వేలంకు ముందు తన బయోడేటా, పాస్‌పోర్టు సైజు ఫోటో, ఏదేని గుర్తింపు కార్డు నకలును పంచాయతీ వారికి ఇవ్వవలెను. 11) ఇతర వివరములు తెలుసుకొనుగోరు వారు కార్యాలయము పనిచేయు వేళలందు కార్యనిర్వాణాధికారి వద్దకు వచ్చి తెలుసుకొనవచ్చును.

శ్రీ బి.వి.మురళీకృష్ణ, సర్పంచ్, గ్రామపంచాయతీ, రామకుప్పం | శ్రీ కె.రామచంద్ర, ఎం.ఏ డివిజనల్ పంచాయతీ అధికారి, చిత్తూరు | శ్రీ మురళీధర్‌రెడ్డి, మండలపరిషత్ అభివృద్ధి అధికారి, రామకుప్పం | శ్రీ మనోహర్‌శర్మ విస్తరణాధికారి (పం,రా-గ్రా.అ.) రామకుప్పం మండలం | శ్రీ ఆర్.కె.సోమశేఖర్ పంచాయతీ కార్యదర్శి (ఇ.ఓ) రామకుప్పం గ్రామ పంచాయతీ

## బస్సుల బ్రేక్ వ్యవస్థపై సాంకేతిక సిబ్బందికి శిక్షణ కార్యక్రమం

తిరుపతి రవాణ, మార్చి 28 ప్రభాతవార్త



తిరుపతి జిల్లాలో మెకానిక్ మరియు సాంకేతిక పర్యవేక్షణ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. డిప్యూటీ సీఎంఈ బాలాజీ ఆధ్వర్యంలో, డిటిటిఓ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.అశోక్ లేలాండ్ వాహనాల పనితీరు మెరుగుపరుచేపై, ముఖ్యంగా బ్రేక్ వ్యవస్థ నిర్వహణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ శిక్షణను నిర్వహించారు. నెల్లూరు జోనల్ వర్క్స్ షాప్‌కు చెందిన జోనల్ వర్క్స్ మేనేజర్ శ్రీ ఇబ్రహీం, సాంకేతిక నిపుణులతో కలిసి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ చిత్తూరు/తిరుపతి మరియు అన్నమయ్య జిల్లాల పరిధిలోని 19 డిపోల నుంచి సాంకేతిక మరమ్మత్తుల సిబ్బంది, పర్యవేక్షణ సహాయకులు పాల్గొన్నారు. బస్సుల బ్రేక్ వ్యవస్థ నిర్వహణలో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, పనితీరు మెరుగుదల చర్యలపై వారికి అవగాహన కల్పించారు.మొత్తంగా ఈ శిక్షణ కార్యక్రమం సాంకేతిక సిబ్బందిలో నైపుణ్యాలను పెంపొందించడంలో, వాహనాల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

## రైతులకు విరివిగా సింగిల్ విండో సొసైటీ ఋణాలు

### -దుర్గసముద్రం రైతులతో మల్లంగుంట సింగిల్ విండో చైర్మెన్ మధుశేఖర్

తిరుపతిరూరల్, మార్చి28 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలంలోని రైతులకు మల్లంగుంట సింగిల్ విండో సొసైటీ విరివిగా ఋణాలు అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మెన్ చెరుకూరి మధుశేఖర్ తెలిపారు. శనివారం తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీ రైతులతో మధుశేఖర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతుల అవసరాలు, పంటల పరిస్థితులు, ఋణా సౌకర్యాలు చర్చించారు. ఈ సమీక్షలో చైర్మెన్ మాట్లాడుతూ సింగిల్ విండో సొసైటీ ద్వారా రైతుల అవసరాలకు అనుగుణంగా విరివిగా ఋణాలు అందిస్తామని తెలిపారు. పంట ఋణాలు కోసం ఎకరాకు రూ.1లక్ష రుపాయాలు, గృహ అవసరాలకు కోసం. రూ.3లక్షల రుపాయాలు ఋణాలు మంజూరు చేస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధి కోసం సొసైటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామంలోని సబ్ కార్యాలయంలో సరైన సౌకర్యాలు లేవని, ముఖ్యంగా ఏటిఎం ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. దీనిపై స్పందించిన చైర్మెన్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు తక్కువ ధరకు వ్యవసాయ పనిముట్లు సొసైటీ ద్వారా అందించుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఆధునిక పద్ధతిలో సాగు చేయడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు మార్కెట్ చైర్మెన్ మాణిక మునిశేఖర్, మాజీ సర్పంచ్‌లు చిన్న, రమేష్‌బాబు, నాయకులు రవి, చంద్రశేఖర్, వెంగళరాయలు, ప్రహ్లాదరెడ్డి, సునీల్, సుధాకర్, శ్రీను, మోహన్,నాగరాజు, రమణారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ సెక్రటరీగా సాంబా శివమూర్తి

రేణిగుంట, మార్చి 28 ప్రభాతవార్త



రేణిగుంట (తిరుపతి) ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీగా సీనియర్ ఎండబ్ల్యూ టెక్నీషియన్ సాంబా శివమూర్తి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో శివమూర్తిని ఘనంగా సత్కరించారు. పదవి బాధ్యత పెంచిందని శివమూర్తి అన్నారు. రైల్వే శాఖ కు అనుసంధానమైన సిఆర్ఎస్ ఉద్యోగులు కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు అప్పగించిన పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని తెలిపారు. తనకు ఇంత గొప్ప పదవి రావడానికి సిఫార్సు చేసిన, డివిజనల్ ఆఫీస్ సెక్రటరీ నరసింహ,జోనల్ ప్రెసిడెంట్ అంగడి వినోద్, జోనల్ కార్యదర్శి దాశరథి కృష్ణ, జోనల్ ట్రెజరర్ సాయిబాబా తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఓబీసీ అసోసియేషన్ మునెయ్య, సంఘ చైర్మన్ మురుగ ప్రసాద్, మజ్దూర్ యూనియన్ కార్యదర్శి బాబు, డిఎంఆర్కేఎస్ డివిజనల్ కార్యదర్శి సీనప్ప, డివిజనల్ ఆఫీస్ కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొని శివ మూర్తిని అభినందించారు.

## ఎస్వీ వైద్య కళాశాలలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర జీరో వేస్ట్ కార్యక్రమం

తిరుపతి హెల్త్, మార్చి 28, ప్రభాతవార్త




ఎస్వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎస్ వి వైద్య కళాశాల ప్రాంగణంలోని అన్ని హాస్టళ్లు, ఆసుపత్రులు, జీరో వేస్ట్ కార్యక్రమం అమలు చేయాలని ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల జీరో వేస్ట్ ఇన్ ఇన్స్టిటూట్ అనే వినూత్న థీమ్‌తో కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్య కళాశాల మహిళ వసతి గృహంను సందర్శించి అక్కడ అమలు చేస్తున్న వ్యర్థ నిర్వహణ విధానాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసే సోర్స్ సెగ్రిగేషన్ పద్ధతిని సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, తడి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో డీ కంపోజ్ చేసి ఎరువుగా మార్చి, అదే హాస్టల్ పరిధిలో ఆకుకూరలు, క్యారెట్, బీట్‌రూట్ వంటి కూరగాయలను పండించేందుకు వినియోగిస్తున్నారని చెప్పారు. దీని ద్వారా హాస్టల్‌కు అవసరమైన కూరగాయల కొనుగోలు వ్యయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. తడి చెత్త నుంచి ఉత్పత్తి అయ్యే ద్రవాన్ని హైడ్రోపోనిక్స్ విధానంలో వినియోగిస్తూ మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను జిల్లాలోని వైద్య కళాశాల, ప్రాంగణంలోని అన్ని హాస్టళ్లు, ఆసుపత్రులు మరియు ఇతర సంక్షేమ సంస్థల్లో అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి ఎస్ ఎన్ మూర్తి, సామాజిక వైద్య విభాగ డాక్టర్ సరిత, డాక్టర్ హేమలత, సామాజిక వైద్య విభాగ వైద్యులు, వైద్య అధ్యాపకులు, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు, వైద్య కళాశాల పరిపాలన సిబ్బంది, వైద్య సిబ్బంది, తిరుపతి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు సురేష్ బాబు సి, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏటుకూరి గిరిబాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా సెక్రటరీ కేసి సుబ్రహ్మణ్యం, మురళి, సి. దేవేంద్ర వర్మ, పారిశుద్ధ్య కార్మికులు, ఎస్వి వైద్య కళాశాల పి.ఆర్ఓ. వీరకిరణ్ తదుతరులు పాల్గొన్నారు.

## దేవస్థానంపై తప్పుడు సమాచారం ప్రసారం చేసిన వ్యక్తిపై కేసు

శ్రీకాళహస్తి, మార్చి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంపై తప్పుడు సమాచారాన్ని సామాజిక మాద్యామాల్లో ప్రసారం చేసిన గుర్తుతెలియని మహిళపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసినట్లు ఆలయ కార్యనిర్వహాణాధికారి బికె వెంకటేశు శనివారం మీడియాకు తెలిపారు. గుర్తుతెలియని మహిళ దేవస్థానం పరువు ప్రతిష్టలకు భంగం కల్గించేలా ప్రవర్తించినందుకు సదరు మహిళపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇఓ తెలిపారు. అంతేకాక ఓ పవిత్రమైన ఆధ్యాత్మిక నిలయంగా శ్రీకాళహస్తీశ్వరాలయం విరాలజిల్లుతుందని అలాంటి దివ్యక్షేత్రంపై తప్పుడు సమాచారం ప్రచారం చేసే వారిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి సమాచారాన్ని భక్తులు నమ్మవద్దని ఇఓ వెంకటేశులు తెలిపారు

## నిరుపేదలకు అన్నదానం

తొట్టంబేడు, మార్చి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు సుపరిచయస్తులైన స్వర్గీయ పులి మస్తాన్ 10వ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు పులి శ్రీకాంత్ సారథ్యంలో నిరుపేదలకు అన్నదానం ఏర్పాటు చేసారు. శనివారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు సమీపంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిదిగా పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు హాజరయ్యారు. అలాగే మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య, యానాది సంఘం అధ్యక్షులు చందమామల కోటయ్య,,విద్యార్థి సంఘ జిల్లా సహాయ కార్యదర్శి మునిచందు,న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి, ధారా పాండు, గణేష్,గుండాల బాబు, శంకర్ డాక్టర్ కొప్పాల సుబ్రమణ్యం,అల్లం మణి,బాలుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య సేవలకు స్మరణగా జక్కంపూడి మునిరత్నంకు నివాళి

తిరుపతి విద్య, మార్చి 28 ప్రభాతవార్త



విశ్రాంతాచార్యులు జక్కంపూడి మునిరత్నం సాహిత్య, విద్యా సేవలను స్మరించుకుంటూ విశ్వవిద్యాలయంలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు విభాగంలో దాదాపు పాతిక సంవత్సరాల పాటు సేవలందించిన ఆయనకు అధ్యాపకులు, విద్యార్థులు భావోద్వేగంగా నివాళులర్పించారు.శనివారం నిర్వహించిన సంస్మరణ సభలో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మునిరత్నం పీజీ, పిహెచ్‌డీ విద్యార్థిగా ప్రారంభించి, అనంతరం అధ్యాపకునిగా అదే విభాగంలో విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు.ఓఆర్ఎస్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ, కళ్లకు చూపు లేకపోయినా కంప్యూటర్ టైపింగ్‌లో నైపుణ్యం సాధించిన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సాహిత్యవేత్తగా మునిరత్నం ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆచార్య సర్వోత్తమరావు, ఆచార్య శారద, ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ కడియాల వెంకటరమణ, ప్రొఫెసర్ నల్లన్న, గెస్ట్ ఫ్యాకల్టీ సునీల్ కుమార్, అశోక్, ఆదిశేషయ్యతో పాటు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.మొత్తంగా ఈ సంస్మరణ సభ ఆయన విద్యా, సాహిత్య సేవలను స్మరించుకునే భావోద్వేగ క్షణాలుగా నిలిచింది.

## తక్కువనీటితో సాగయ్యే పంటలు చేపట్టాలి : డిఎఒ

బైరెడ్డిపల్లి, మార్చి 28 ప్రభాతవార్త



రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళి సూచించారు. శనివారం ఆయన మండలంలో పర్యటించి రైతుల పంటలను, వర్మిబెడ్లు, పాతరగడ్డి కిట్ల పనితీరు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలసాగు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్‌లో ముందస్తుగా కురిసే వర్షాలకు రైతులు ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా అందించే పిఎండిఎస్ విత్తనాలను విత్తాలని తద్వారా భూమిలో కర్బన తేమ శాతం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పశువులకు మేత కూడా లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులు అవగాహన పెంచుకుని ఆ పంటలసాగు చేపట్టాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని రైతులను కోరారు.

## దళితుల భూములను పరిరక్షించాలి

రామకుప్పం, మార్చి 28 ప్రభాతవార్త




మండలంలోని గడ్డూరు గ్రామంలో దళితుల భూములను పరిరక్షించాలని కోరుతూ శనివారం టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్‌కు దళిత నేతలు, రైతులు వినతి పత్రాన్ని అందించారు. గడ్డూరు ప్రాంత సమీపంలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అది ఏర్పాటైతే తమ భూముల్లో ఉన్న మామిడి, అరటి, కొబ్బరి, టేకు వృక్షాలతో పాటు సాగు చేస్తున్న పంటలు కోల్పోయి రోడ్డున పడతామన్నారు. ప్రభుత్వం స్పందించి దళిత కుటుంబాలకున్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, గోవిందప్ప, జయప్ప పాల్గొన్నారు.

## రేపు పంచాయతీ గుత్తేల బహిరంగవేలం

రామకుప్పం, మార్చి 28 ప్రభాతవార్త

రామకుప్పం మేజర్ గ్రామ పంచాయతీలో పలు గుత్తేలకు సంబంధించి ఈనెల 30న బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి 2027మార్చి 31వతేది వరకు వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, మూడు షాపింగ్ గదులు, ఆరు చికెన్ దుకాణ గదులు నిర్వహించుకునేందుకు వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 30వతేది ఉదయం 11గంటలకు వేలంపాటలు నిర్వహిస్తామన్నారు.ఆసక్తిగల వారు ఆరోజు ఉదయం 11గంటల్లోపు నిర్దేశిత డిపాజిట్ నగదు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## నేడు ధ్వజస్థంభం ప్రతిష్ట

ఏర్పేడు,మార్చి 28 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిని అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో ఏప్రిల్ 19నుంచి మహాకుంబాభిషేకం నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో ఆలయ చైర్మెన్ బత్తలగిరి నాయుడు,ఇఓ రామచంద్రారెడ్డిలు పరుగులు తీస్తున్నారు. మరమ్మత్తు పనులు యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాట్లు పరుగులు తీయిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాతలను బాగస్వాముల్ని చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ధ్వజస్థంభం ఏర్పాటుకు నెల్లూరుకు చెందిన ఎంఎల్‌సిని కలసి అభ్యర్థించారు.వారు ధ్వజస్థంభం ఏర్పాటుకు అభ్యర్థించారు.వారు అంగీకరించారు. ఈ కార్యక్రమాలను ఆదివారం ఏర్పాటు చేయుటకు సిద్ధం చేసారు. ఎంఎల్‌సి బీద రవింద్ర, ఆయన సతీమణి జ్యోతిలు పాల్గొననున్నారు.చైర్మెన్ బత్తలగిరి నాయుడు సారధ్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించుటకు సిద్ధం చేస్తున్నారు.

## 3దశాబ్దాలుగా ఎయిడ్స్‌పై పోరాటం

### వ్యాది గ్రస్తులకు పౌష్టికాహారం

### స్టేప్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రమీలమ్మ

శ్రీకాళహస్తి,మార్చి 28 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 3 దశాబ్దాలకు పైగా స్టెప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రమీలమ్మ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నారు. ఎయిడ్స్ పై అవగాహనకు ఆమె సాగిస్తున్న పయనం 30 సంవత్సరాలు దాటింది. సామాజిక సేవలదించుటకు డాక్టర్ ప్రమీలమ్మ స్టెప్స్ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించారు. వృత్తి రీత్యా డాక్టర్‌అయిన (గైనకాలజిస్టు) అమె ఆధ్యాత్మిక చింతనలో మొదటి స్థానంలో ఉన్నారు. శ్రీకాళహస్తీశ్వరునికి అపోలో సంస్థల ద్వారా పాతికేళ్ళ ముందు స్వామి కి వెండి నంది వాహనం, అమ్మవారికి వెండి సింహవాహనాన్ని వితరణగా చైర్మెన్ సి. ప్రతాప్‌రెడ్డి కుటుంబం ద్వారా ఇప్పించారు. ఆమె రెండు సంవత్సరాల పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యురాలుగా ఉన్నారు.అలాగే ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా పేద జంటలకు 'బంగారు తాళిబబొట్టులను 'అందిస్తున్నారు.

**అవగాహనతోనూ అరికట్టగలం:**

శ్రీకాళహస్తిలోని నగరి వీధిలో ఆమె నర్సింగ్ హోంలో ఎయిడ్స్ వ్యాధి గ్రస్థులకు పౌష్టికాహారాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆమె అవగాహనకల్గిస్తూ ఎయిడ్స్‌ను రాకుండా అరికట్టడానికి అవగాహనతోనే సాధ్యమని డాక్టర్ ప్రమీలమ్మ వివరించారు.వ చ్చిన తరువాత చేసేది ఏమి లేదని అయితే రాకుండా ఉండటానికి అవగాహన ఎంతో అవసరం అన్నారు.అయితే గర్భవతులు అవగావహనతో బిడ్డకు సోకకుండా కాపాడవచ్చునని వివరించారు. ఈ సందర్భంగా ఆమె ఎఆర్‌టి మందుకు సంబంధించి వివరించారు. 30 మంది వ్యాధిగ్రస్తులకు,గర్భిణీ స్త్రీలు,పిల్లలకు న్యూట్రీషియన్ పౌడర్‌ను,విటమిన్ గుళికలు, మినరల్ ఫుడ్ అందించారు.ఈ కార్యక్రమాల్లో ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్, డియస్ ఆర్‌సి కౌన్సిలర్ ఉష, కౌన్సిలర్ రాధిక,స్టెప్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలకృష్ణతో శ్రీకాళహస్తి ఎంఎల్‌ఏ అల్పాహార విందు

శ్రీకాళహస్తి,మార్చి 28 ప్రభాతవార్త



అమరావతిలో ఒక్కరోజు అసెంబ్లీ సమావేశాలకు శనివారం శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఉదయం అసెంబ్లీ ఆవరణలో ప్రముఖులతో కలసి ఆయన అల్పాహార విందు లో పాల్గొన్నారు. హిందూపురం శాసనసభ్యుడు, సినీ నటులు నందమూరి బాలకృష్ణ, రాజమండ్రి శాసనసభ్యుడు బుచ్చయ్యచౌదరిలతో కలసి అల్పాహారం తీసుకున్నారు.కులాసాగా మాట్లాడుకుంటూ ఆయా నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి గురించి చర్చించుకున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉంది.ఈ నేపథ్యంలో ఇక్కడి శ్రీకాళహస్తీశ్వరాలయం అభివృద్ధి గురించి సహచర ఎంఎల్‌ఏలకు సుధీర్‌రెడ్డి వివరించారు. ఇదో ఆధ్యాత్మిక సిటిగా తీర్చి దిద్దుటకు చేపడుతున్న పథకాలను బాలకృష్ణ, బుచ్చయ్య చౌదరిలకు వివరించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు.

## తాటిపర్తికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

తొట్టంబేడు, మార్చి 28 ప్రభాతవార్త



మండలంలోని ప్రధాన పంచాయతీల్లో ఒకటైన తాటిపర్తికి మరో అదనపు ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు ఇక్కడ నిర్మాణం జరుగుతున్న జగనన్న కాలనీ వాసులు తమ బాధలను ప్రభాతవార్తకు తెలిపారు.ఇక్కడ జగనన్న కాలనీలో సుమారు 100 మందికి పక్కాగృహాలు మంజూరు చేసారు.ఈ కాలనీకి సంబంధించి ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. చుట్టుపక్కల పంట పొలాలు కావటం తెలుగుగంగ కాలనీలో నీరు సమృద్ధిగా పారుతుండటంతో రైతులు తమ మోటార్లకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను తీసుకుంటున్నారు. దాంతో కాలనీలో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలకు నీటి కొరత చోటు చేసుకుంటుంది. ఈ సమస్యను ఎన్నో సార్లు స్థానిక నాయకులకు, విద్యుత్ శాఖ అధికారులకు మొరబెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేదని కాలనీ లో ఇళ్ళు నిర్మించుకుంటున్న వారు వాపోతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌నుంచి విచ్చల విడిగా వైర్లు తీసుకోవటంతో కాలనీలో ఇళ్ళ నిర్మాణం నత్తనడకన సాగుతుందని వాపోతున్నారు.ఇప్పటికైనా జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణం వేగంగా జరగాలంటే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## సిఐచే చలివేంద్రం ప్రారంభం

తొట్టంబేడు, మార్చి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేట శీతాలమ్మ ఆలయం వద్ద బుచ్చినాయుడుకండ్రిగ సిఐ తిమ్మయ్య చేతుల మీదుగా ఆలయ భక్తబృందం వారి ఆధ్వర్యంలో చలివవేంద్రంను శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సిఐ తిమ్మయ్య మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వలన ప్రజలు జాగ్రత్తలు ఎక్కువ పాటించాలన్నారు. ప్రజలు,ప్రయాణీలు,భక్తుల సౌకర్యార్థం దృష్ట్యా సాధ్యమైనన్ని చోట్ల మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి మంచినీటి సదుపాయం కల్పించాలని సిఐ సూచించారు. గతంలో మున్సిపాలిటి చలివేంద్రాలు ఏర్పాటు చేసేదని అలాగే దేవస్థానం కూడా నాలుగుమాడావీధుల్లో చ లివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు,స్వచ్ఛంద సేవాసంస్థలు ముందుకు రావాలని కారు.ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసిన శీతాలాంబ అలయ అధ్యక్షుడు పాలమంగళం రవి ఆర్గనైజర్ అత్తింజేరి నాదముని అశోక్, ప్రకాష్,కత్తిరవి కానిస్టేబ్ హేమంత్,సాయన్న,చంద్రారెడ్డి, హరి, వెంకటసుబ్బయ్య, మహేష్‌రావు,వెంకటాద్రి నాయుడు బాల గురవయ్య,జాజాల మునిశేఖర్‌లను సిఐ తిమ్మయ్య అభినందించారు.

# తిరుపతి డివిజన్

## కోచింగ్ సెంటర్ల మాఫియాపై ప్రభుత్వం భారీ దెబ్బ

తిరుపతి విద్య మార్చి 28 ప్రభాతవార్త: ప్రభుత్వం కోచింగ్ సెంటర్ల అక్రమాలపై కఠిన చర్యలు ప్రారంభించింది. నిబంధనలు పాటించని సంస్థలపై ఆకస్మిక దాడులు నిర్వహించి లైసెన్సులను రద్దు చేస్తున్నారు. విద్యార్థులను మోసం చేస్తున్న, తప్పుడు హామీలు ఇస్తున్న సంస్థలపై కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.ఫీజుల నియంత్రణ, పారదర్శక విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతూ, గుర్తింపు పొందిన సంస్థల్లోనే చేరాలని సూచిస్తున్నారు.అదనంగా, కోచింగ్ సెంటర్ల పనితీరును పర్యవేక్షి ంచేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. విద్యా రంగంలో క్రమబద్ధత తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు.

5 గంటల లిమిట్‌తో కోచింగ్ రాజుల సింహాసనం కూలిందే!

ఉన్నత విద్యా శాఖ ప్రకటించిన కొత్త నిబంధనలతో రాష్ట్రంలోని కోచింగ్ సెంటర్ల వ్యవస్థ పూర్తిగా కుదేలైపోయింది. ఇక్కడివరకు పూర్తిగా వారి చేతుల్లో నడుస్తున్న విద్యార్థుల జీవితాలు ఇప్పుడు ప్రభుత్వ నియంత్రణలోకి మళ్లుతున్నాయి. రోజుకు 5 గంటలకు మించి క్లాసులు నడపకూడదు అనే నిర్ణయం కోచింగ్ యాజమాన్యాలపై పడిన తొలి మెరుపు. ఉదయం 5 నుంచి రాత్రి 11 వరకు బంధించడాన్ని అలవాటు చేసుకున్న సెంటర్లు ఇప్పుడు చేతులు కాల్చుకుంటున్నాయి. స్కూల్, కాలేజీ సమయాల్లో క్లాసులు నడపడం నేరం అవడంతో విద్యార్థుల ప్రాథమిక విద్యా హక్కు రక్షి తమవుతోంది. సెలవు రోజుల్లో కూడా క్లాసులు పెట్టకూడదన్న నిబంధన మానసిక ఒత్తిడిని తగ్గించే ప్రధాన అడుగు. విద్యార్థులను ఫ్యాక్టరీల్లో పనిచేసే మాదిరిగా గంటలకొద్దీ కూర్చోబెట్టే వ్యవస్థకే ఈ నిర్ణయం కడుపుబ్బ దెబ్బ. ఇప్పుడు క్లాసు నిర్వహణకు సరైన షెడ్యూల్ తప్పదు, ఎక్కడయినా పాటించకపోతే నేరం అయిపోతుంది. కొత్త నియమాలతో కోచింగ్ సెంటర్లు విద్యార్థుల సమయాన్ని కబళించే కాలం ముగిసిపోతోంది. ఏ కోచింగ్ సెంటర్ ఎప్పుడు తెరుస్తుంది, ఎప్పుడు మూసివేస్తుంది అన్నదాన్ని ప్రభుత్వం నేరుగా పర్యవేక్షి ంచబోతోంది.

ఫీజుల దోపిడీకి బ్రేక్ – 10 రోజుల రూల్ తో మాఫియాకు గుండెల్లో గుబులు

ఇదివరకు ఫీజులు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చే కోచింగ్ వ్యవస్థకు ఇప్పుడు చట్టపరంగా తాళం వేసే రోజులు మొదలయ్యాయి. కొత్త నిబంధనల ప్రకారం కోచింగ్ సెంటర్లు 10 రోజులకు మించిన ఫీజులు ముందుగానే వసూలు చేయరాదు. ఈ ఒక్క నియమమే అనేక సెంటర్ల ఫైనాన్షియల్ దోపిడీని తృటిలో ఆపేస్తోంది. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత చూడకుండా భారీ అడ్వాన్స్‌లు అడగడం ఇక చట్టరీత్యా నేరం. ముఖ్యంగా, విద్యార్థి కోర్సు మధ్యలో మానేస్తే మిగిలిన ఫీజు మొత్తం తిరిగి ఇవ్వాలి. ఇది కోచింగ్ యాజమాన్యాల దౌర్జన్యానికి పెద్ద మోకాళ్ల దెబ్బ. ఇక ఎవరూ రిఫండ్ లేదు అనే బోర్డులు పెట్టుకోలేరు. ఫీజుల అక్రమ వసూలు కొనసాగితే మొదటి తప్పుకు 50 వేల జరిమానా, రెండోసారి లక్ష జరిమానా నేరుగా పడనుంది. మూడోసారి అయితే కోచింగ్ సెంటర్ లైసెన్సే రద్దు చేయబడే పరిస్థితి. కోచింగ్ సెంటర్లు ఆధిపత్యంగా వ్యవహరించే కాలం ఇప్పుడు చట్టపరంగా ముగిసి, తల్లిదండ్రులకు ఊరట లభిస్తోంది.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పట్టివేతకు చెక్ – విద్యార్థుల హక్కులకు చట్ట రక్షణ

చాలా కోచింగ్ సెంటర్లు సంవత్సరాలుగా విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను బందీలుగా పెట్టుకుని వచ్చిన పద్ధతికి ఇప్పుడు శాశ్వత శవపేటిక వేయబడింది. కొత్త నిబంధనల ప్రకారం ఏ కోచింగ్ సెంటర్ కూడా విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు తమ వద్ద ఉంచుకోరాదు. విద్యార్థులు కోర్సు మార్చాలనుకున్నా, హాస్టల్ మారాలనుకున్నా భయానక అనుభవాలు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఇకుండదు. గతంలో సర్టిఫికెట్లు కట్టేసి విద్యార్థులను బలవంతంగా హాస్టల్లో ఉంచిన ఘటనలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి వాటికి ముగింపు పలికేలా చట్టం కఠినంగా మారింది. సర్టిఫికెట్లు దాచిపెట్టడం టాలెంట్‌ను కట్టేయడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదం అని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఈ నిబంధన పాటించకపోతే కోచింగ్ సెంటర్‌పై నేరం నమోదు అయ్యే అవకాశం కూడా ఉంది. విద్యార్థులు తమ డాక్యుమెంట్లపై పూర్తి హక్కు కలిగివున్నారనే స్పష్టమైన సందేశం ఈ నియమంతో బయటపడింది. ఇకపై ఎవరు కూడా విద్యార్థులను బందీలుగా చేసుకోలేరు. విద్యార్థుల స్వేచ్ఛ, భద్రత ఇప్పుడు చట్టపరంగా రక్షి తమైంది.

భద్రత, హాస్టల్ పరిస్థితులపై కఠిన పర్యవేక్షణ – సీసీటీవీ లేకుంటే సీల్

ఇదివరకు కోచింగ్ సెంటర్లలో హాస్టల్ భద్రత పెద్ద సమస్యగా నిలిచింది. విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణల్లో హాస్టళ్లలో ఉన్న లోపాలే కారణమని బయటపడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇప్పుడు క్లియర్ ఆర్డర్ ఇచ్చింది. ప్రతి తరగతి గదిలో సీసీటీవీ తప్పనిసరి. సీసీటీవీ లేకపోతే వెంటనే కేసులు పెట్టబడతాయి. హాస్టళ్లలో ఆత్మహత్య నిరోధక ఫ్యాన్లు తప్పనిసరి. భద్రతా ప్రమాణాలు పాటించని హాస్టళ్లను సీల్ చేసే అధికారం ప్రభుత్వం ఇచ్చింది. ఇక్కడవరకూ ఉన్న నిరక్ష ్యం ఒక్క రోజులోనే నియంత్రణలోకి రాలేదు కానీ ఈ నిబంధనలతో పరిస్థితి మారబోతోంది. విద్యార్థుల రూమ్‌ల భద్రత, తాగునీరు, శుభ్రత, హెల్త్ చెకప్స్ ఆల్ ఐ నౌ కం అండర్ స్ట్రిక్ట్ మానిటరింగ్.హాస్టల్ అనేది నివాస స్థలం కాదు, బాధల బంకర్ అయిపోయిందని వచ్చిన విమర్శలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇక నుంచి విద్యార్థుల భద్రత విషయంలో రాజీపడితే సెంటర్ మూసివేత తప్పదనే హెచ్చరిక ఇచ్చింది.

ఎస్పీ–డీఈవో కమిటీతో బిగ్ బాస్ మానిటరింగ్ – ఫిర్యాదులపై తక్షణ చర్య

ప్రభుత్వం అత్యంత శక్తివంతమైన మానిటరింగ్ యంత్రాంగాన్ని రూపొందించింది. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు చేసే ఫిర్యాదులపై వెంటనే స్పందించేందుకు ఎస్పీ, డీఈవో, విద్యా శాఖ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఇది రాష్ట్రంలో మొదటిసారి తీసుకున్న అత్యంత కఠిన చర్య. కోచింగ్ సెంటర్లు ప్రభావం చూపకుండా, రాజకీయ ఒత్తిడి లేకుండా, కేసుల్లో జోక్యం లేకుండా నిష్పాక్షి క విచారణ చేయడానికి ఈ కమిటీ పనిచేస్తుంది. ఎవరి ఫిర్యాదైనా 24 గంటల్లో పరిశీలనకు తీసుకుంటారు. నిబంధనలు ఉల్లంఘించిన సెంటర్లపై వెంటనే కేసులు నమోదు చేయబడతాయి. అవసరమైతే కోచింగ్ సెంటర్‌ను సీల్ చేయడమూ ఈ కమిటీ అధికారంలో ఉంది. ఇది విద్యార్థుల భద్రతకు సేఫ్టీ నెట్ లాంటిది. కోచింగ్ యాజమాన్యాలు ఇప్పటి వరకు చూసిన విధంగా ఇది సాధారణ సమీక్ష కమిటీ కాదు చట్టపరంగా బలం కలిగిన మానిటరింగ్ బోర్డ్. ఇప్పుడు ఎవరు కూడా పోలీసు, విద్యా శాఖ నుంచి తప్పించుకోలేరు. ఫిర్యాదుల ఆధారంగా తక్షణ చర్య తప్పదనే సందేశం రాష్ట్రవ్యాప్తంగా మార్మోగుతోంది.

## మూడు కోట్లు మింగారు...మురికిని మరిచారు...!



రైల్వే కోడూరు, మార్చి 25,ప్రభాత వార్త నియోజకవర్గ కేంద్రమైన రైల్వే కోడూరు పట్టణం పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ఆదర్శంగా ఉండాల్సింది. అయితే నియోజకవర్గం లోని మిగిలిన నాలుగు మండలాలకు అపరిశుభ్రతకు ఆనవాలుగా మారి నిదర్శనం గా నిలిచి పట్టణం వీదులో తిరిగే జనాలకు ముక్కులు మూసుకొని పరిస్థితి కి అద్దం పడుతుంది. అయితే పాపం ఆపంచ్చాయితికి నిధులు లేవేమో, పన్నులు, వసూలు కావేమో, ప్లాట్ల అప్రూవల్స్ అన్యాయం గా వసూలు చేయరేమో అనుకుంటు న్నారేమో, అలా అనుకుంటే మాత్రం పొరపాటు పడ్డట్టే!అలా కాదు ఈ పంచాయతీ మేజర్ పట్టణ గ్రామపంచాయతీ. దీని, కున్న నిధులు అధికం దీనికొచ్చే నిజాయితీఆధాయాలకంటే అక్రమ ఆధాయాల సంపాదన చెప్పలేనంత అని అనుకుంటున్నారంటే,అది నూటికి నూ రుపాళ్ళు నిజమే అయితే ఈ పంచాయతీ ఆధాయం కూడా ఏటా కోట్లలోనే ఉంటుంది. గత ఏడాది చివరిలో పంచాయతీ నిధులు..3కోట్ల మేర మింగేశారన్నది, నియోజకవర్గం లోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన సంఘటన కూడా విధితమే. ఈ మేజర్ పట్టణ గ్రామ పంచాయతీ నిధులు ఎందరో అవినీతి పరులకు ఆధాయంగా మారాయి. అయితే ప్రజల కోసం వారి మౌలిక వసతులు కోసం ఖర్చులు చేయడంలో ఒక్కరూ పట్టించు కోలేదు నిధులు మింగిన నాయకులు, అధికారులు మిన్నకుండి పోయారు. దీంతో పట్టణంలోని వీదులో మురికి ఎరులై పారుతూ ఇళ్ల ముందర, రోడ్డుపై వెళ్లే వారికి వాగులు, వంకలను తలపిస్తూ అత్యంత దూరవాసనలను వెధజళ్ళుతు జుమ్మున క్రిమి కీతకాదులతో ఉన్నాయి. దీనికి తోడు తోపుడు బండ్లపై వివిధ రకాలైన ఐస్క్రీం, కరబుజా, దోస వంటి వ్యాపారులు రోడ్డు పై పారుతున్న మోకాటి లోతు మురుగు నీటిలోనే బండ్లు పెట్టుకొని నిలబడి దురవాసనను కూడా లెక్కచేయకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. దాహం దాహార్ధి అక్కడ ఐస్ క్రీం ఉందా, బాధంపాలు, శరబత్ ఉందా అని చూస్తున్నారే తప్ప అది ఎక్కడఉంది. దాని చుట్టూ పరిసర ప్రాంతాలు ఎలా ఉన్నాయి ఈగలు, దోమలు ముసురుతున్నాయా అది ఉన్న ప్రదేశంలో మురుగు నీరు ఉందా పరిశుభ్రంగా ఉందా అని వెనుకు ముందు చూడకుండా దాహం తీరితే చాలని శరబత్ బండికి ఎగబడి మరి తాగు తున్నారంటే దాహం పరిస్థితి అలా ఉంటుంది. పైన కాచే ఎండను చూస్తున్నారే తప్ప కింద ఉన్న మురుగును చూడకుండా దోమలు, ఈగలు ముసురుతున్న రోగాల పానీయాలానే తాగి దాహం తీర్చు కొంటున్న పరిస్థితి. ఏటా కోట్ల ఆధాయాన్ని తెచ్చి పెట్టే కోడూరు మేజర్ పట్టణ గ్రామ పంచాయతీ లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కుటుంబాల వారు దుఖనా దారులు బయటకు రావాలన్న, లోపలికి వెళ్లాలన్న పంచాయతీ వాళ్ళు పట్టించుకోకుండా వదిలిన మురుగు నీటిలో దిగివెల్లాల్సిందే. గత కొన్ని రోజులుగా ఇలాంటి పరిస్థితులు కోడూరు పట్టణ పంచాయతీ ప్రజలు అనుభవిస్తూ ఉన్నారు. ఈ పట్టణంలో పెద్ద స్థాయి నాయకులు న్నారు. అదే విధంగా అన్నిశాఖల పెద్ద పెద్ద ప్రభుత్వ అధికారులు ఉన్న నియోజకవర్గకేంద్రంలోని పంచాయతీ ప్రజలకు మురుగు నీటిని తొలగించే దిక్కున్న వారే లేరంటే ఇంత కంటే దయనీయమైన పరిస్థితి ఇంకొకటి ఉండదు. అంటే వీళ్లిద్దరు లేకపోతే నియోజకవర్గం కేంద్రంలో ఉన్న ఇతర ప్రభుత్వ స్థాయి అధికారులకు ప్రజా ప్రతినిధులకు ప్రజా సమస్యలు పట్టవా, ప్రతి వారం ప్రజా ధర్బార్ నిర్వంచే వారికి ఈ సమస్య ఎదుకాలేదా, నిత్యం ఇదే రోడ్డుపై తిరిగే అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రధాన రోడ్డుపై వాగులు, వంకలనుతల తపిస్తూ ఏరులా పారుతున్న మురుగునీరు కనపడలేదా, అయినా ప్రజలు ఎటు పోతే మాకేంటి అన్నట్లు అధికారులు, పాలకులకు వ్యవహరిస్తున్నారు.

# వేగవంతంగా క్లైములు పరిష్కారం

- బూత్ లెవల్ ఏజెంట్ల ఏర్పాటుకు చర్యలు
- జిల్లాలో 15.78 లక్షల మంది ఓటర్లు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త: కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల క్లైములు వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఎఎస్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌తో బోగస్, మృతి చెందిన వారి ఓట్లను జాబితా నుండి తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితా సిద్ధం చేయవచ్చునన్నారు. జిల్లాలో ప్రస్తుతం 15,78,617 మంది ఓటర్లు ప్రస్తుతం వున్నారన్నారు. అలాగే జిల్లాలో 1,776 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బిఎల్‌ఓలకు ఈ ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలను దశల వారీగా నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బిఎల్ఎ ద్వారా పరిశీలించుకోవాలని, అలాగే తమ దృష్టికి వచ్చిన బోగస్, మృతి చెందిన వారి వివరాలను బిఎల్‌ఓలకు తెలిపి వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించడానికి సహకరించాలన్నారు. జిల్లాలో 7 రోజుల కంటే ఎక్కువ కాలం పెండింగ్‌లో వున్న ఫార్మ్స్ తక్కువగా వున్నాయన్నారు. రోజు వచ్చే దరఖాస్తులను అదే రోజున ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ లాగిన్‌కు పంపిస్తున్నామన్నారు. అలాగే బూత్ లెవల్ ఆఫీసర్ల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమంను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, జనసేన ప్రతినిధి యశ్వంత్, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ రాజేంద్ర, ఎన్నికల విభాగ సిబ్బంది ఉమాపతి, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఇవిఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత : కలెక్టర్ సుమిత్‌కుమార్**

ఇవిఎంల భద్రపరచిన గోడౌన్‌కు భద్రత పటిష్టంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఇవిఎం గోడౌన్‌ను శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ గోడౌన్‌లో భద్రపరచిన ఇవిఎం యంత్రాలు, బ్యాలెట్ యూనిట్లు(బియు), కంట్రోల్ యూనిట్లు(సియు), వివిప్యాట్ యంత్రాలు, భద్రతా ప్రమాణాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎంలు భద్రపరచిన గోడౌన్ వద్ద నిరంతరం నిఘా వుండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్‌వి వైద్య కళాశాలలో ... శ్రీ పుట్టపర్తి జయంతి వేడుకలు

తిరుపతి హెల్త్, మార్చి 28 ప్రభాతవార్త: శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు జన్మదినాన్ని ఎస్‌వి వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించారు. (1914–1990) 20వ శతాబ్దపు అగ్రశ్రేణి తెలుగు కవి, పండితుడు, బహుభాషా, కోవిదుడు. ఆయనను గౌరవంగా సరస్వతీపుత్ర అని పిలుస్తారు. ఆయన చిత్రపటానికి అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొన్ని ముఖ్యమైన కవులు, మహానుభావులు, యొక్క పర్వదినాలను గురించి స్మరించుకొని, ఈనాటి తరాలకు తెలియపరచాల్సిన అవసరం ఎంతైనా అవసరం ఉందని మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రాష్ట్ర కార్యక్రమంగా శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు జన్మదినాన్ని జరుపుకుంటు న్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు కేవలం ఒక కవి మాత్రమే కాదు, భారతీయ సంస్క ృతికి మరియు భాషా వికాసానికి అపారమైన సేవ చేసిన గొప్ప మేధావి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ఎస్ ఎన్ మూర్తి, డాక్టర్ చరిత, డాక్టర్ హేమలత, సామాజిక వైద్య విభాగ వైద్యులు, పి.జి వైద్య విద్యార్థులు, యూ.జీ వైద్య విద్యార్థులు, ఎస్ వి వైద్య కళాశాల వైద్య సిబ్బంది, ఏపీ ఎన్జీవోస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు సి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏటుకూరి గిరిబాబు, తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మురళి, పారిశుద్ధ్య కార్మికులు, ఎస్‌వి వైద్య కళాశాల పిఆర్వో వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల భాగస్వామ్యంతో

## జీరో వేస్ట్ లైఫ్ స్టైల్ పై విద్యార్థుల్లో అవగాహన




యూనివర్సిటీ(తిరుపతి),మార్చి 28ప్రభాతవార్త: తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల భాగంగా యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సంధ్య ఆధ్వర్యంలో "సోర్స్ సెగ్రిగేషన్ జీరో వేస్ట్ లైఫ్ స్టైల్" అనే అంశంపై డిబేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో వ్యర్థాల వర్గీకరణ, శుభ్రత పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ శైలజ, డా. హిమగిరీశ్, డా. సౌమ్య,ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదాన సత్రం ప్రారంభం

తిరుపతి కలెక్టరేట్, మార్చి 28 ప్రభాతవార్త : తిరుపతి సాయి నగర్ పంచాయతీ పరిధిలో ఉన్న ఓం శక్తి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన సత్రం శుభారంభం కావడం ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక ఘట్టంగా నిలిచింది. భక్తులకు అన్నదానం చేయడం అన్నది మన భారతీయ సంస్కృతిలో అత్యంత గొప్ప దానం గా భావించబడుతుంది. "అన్నదానం మహాదానం" అనే సత్యాన్ని ఆచరణలో నిలబెడుతూ తిరుపతికి చెందిన దాతృత్వ హృదయులు పసుపులేటి చిట్టిబాబు – లక్షి ్మ దంపతులు ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించడం విశేషం. ఓం శక్తి అమ్మవారి కృపాకటాక్షాలతో, భక్తులకు ప్రసాదంగా అన్నదానం అందించాలనే సంకల్పంతో నిర్మించిన ఈ అన్నదాన సత్రం, భక్తుల ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడటమే కాకుండా, సమాజంలో సేవాభావాన్ని మరింతగా పెంపొందించనుంది. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి సాయి నగర్ సర్పంచ్ డి.వి. రమణ, ఉప సర్పంచ్ సోమశేఖర్ గార్లు మరియు ఇతర ప్రముఖులు హాజరై ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా పసుపులేటి చిట్టిబాబు మాట్లాడుతూ, ఓం శక్తి అమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం నిత్యాన్నదానం ప్రారంభించడం తమకు అపారమైన ఆనందాన్ని కలిగించిందని తెలిపారు

## ఆపదలో ఉన్న తోటి కార్మికుడికి అండగా... మెకానిక్ అసోసియేషన్



తిరుపతి కలెక్టరేట్, మార్చి 28 ప్రభాతవార్త :ప్రమాదానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక తోటి మెకానిక్ కుటుంబాన్ని ఆదుకోవడానికి తిరుపతి మోటార్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు నడుం బిగించారు. "కష్టం వస్తే కాపాడేది తోటి కార్మికుడే" అని నిరూపిస్తూ, మానవత్వంతో భారీ ఆర్థిక సహాయాన్ని అందించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. తిరుపతిలోని మంగళం బీటీఆర్ కాలనీకి చెందిన మెకానిక్ మునీర్ కొద్దిరోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఆయన ఆస్పత్రి పాలవడంతో ఉపాధి కోల్పోయారు. వైద్య ఖర్చులు భరించలేక, పూట గడవక ఇబ్బంది పడుతున్న తరుణంలో తిరుపతి మోటార్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు స్పందించారు. తిరుపతి మోటార్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవులు మునిరెడ్డి సభ్యులందరినీ సమన్వయం చేసి విరాళాలు సేకరించారు. సేకరించిన నగదు రూ.29వేలు, రూ.15వేలు విలువచేసే నిత్యవసర సరుకులు బాధిత కుటుంబానికి అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ వంతు సహాయం అందిస్తామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మోటార్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవులముని రెడ్డి, సెక్రటరీ ఎన్.గురునాథ ఆచారి, గౌరవాధ్యక్షుడు టి.జలంధర్, జనరల్ సెక్రెటరీ పి.లక్ష్మణరావు, ట్రెజరర్ గౌస్ బాషా, వైస్ ప్రెసిడెంట్ వి. ప్రభు, జాయింట్ సెక్రెటరీ పి.తేజరెడ్డి, కమిటీ ఇంచార్జ్ ఎం.కేశవ ఆచారి, కమిటీ మెంబర్స్ బి. నాగరాజు, జి. మురగ, తరుణ్, కె. మురగ, బి పాపయ్య, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మార్చి30న జరగాల్సిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, మార్చి 28 ప్రభాతవార్త :జిల్లాలో మార్చి,30 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల పర్యటనల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నాడు నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ శనివారం పేర్కొన్నారు.మార్చి,30 (సోమవారం) న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు జిల్లాలో నాయుడుపేట,తిరుపతి లలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా , డివిజన్ , మండల స్థాయి అధికారులు వివిధ విధులను నిర్వహిస్తున్నందున జిల్లా వ్యాప్తంగా సోమవారం నాటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్ )కార్యక్రమాన్ని రద్దు పరుస్తున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు .ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు: కమిషనర్



తిరుపతి,మార్చి 28 ప్రభాతవార్త: ఈనెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకరోజు పర్యటన నిమిత్తం తిరుపతికి విచ్చేస్తున్న నేపథ్యంలో నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించే ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఐఎఎస్, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అధికారులు, సిబ్బంది ముఖ్యమంత్రి పర్యటనలో నిమగ్నమై ఉంటారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ తెలిపారు.

## విద్యుత్‌శాఖ వాహనం డీ... యువకుడికి తీవ్రగాయాలు



గంగవరం,మార్చి 28, ప్రభాతవార్త: ప్రభుత్వ విద్యుత్‌శాఖ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల మేరకు..పెద్దపంజాణి మండలం పంజాణికి చెందిన సుబ్రమణ్యం(35) అనే యువకుడు స్వగ్రామం నుండి తన ద్విచక్రవాహనంలో పలమనేరు వైపుకు మండలంలోని పలమనేరు–మదనపల్లె జాతీయ రహదారిపై కల్లుపల్లె సమీపంలో వస్తుండగా పలమనేరు నుండి పుంగనూరుకు వెళ్తున్న పుంగనూరు విద్యుత్‌శాఖ వాహనం వేగంగా,అజాగ్రత్తగా వస్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు.ఈ ప్రమాదంలో విద్యుత్ వాహనం ఢీకొన్న వేగానికి ద్విచక్రవాహనంతో పాటు యువకుడు సుబ్రమణ్యం దాదాపు 20 అడుగుల ఎత్తు ఎగిరి రహదారికి వ్యతిరేక మార్గంలో దాదాపు 100 మీటర్ల దూరంలో పడ్డాడు.తీవ్రంగా గాయపడ్డ యువకుడిని స్థానికులు 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ నేరాలు మాదకద్రవ్యాలపై విద్యార్థులకు చైతన్యం




తిరుపతి,మార్చి 28ప్రభాతవార్త: యువత భవిష్యత్తుకు దిశానిర్దేశంచేస్తూ సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు చైతన్యం కల్పించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శక్తి టీమ్ పోలీసులు తిరుపతిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, మహిళా డీఎస్పీ శ్రీలత , సీఐ తమీమ్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, ఉపాధ్యాయుల విలువ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే వేగంగా వాహనాలు నడపడం వలన కలిగే ప్రమాదాలు, యుక్తవయస్సులో వచ్చే ఆకర్షణల వల్ల ఎదురయ్యే సమస్యలు గురించి తెలియజేశారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే కలిగే నష్టాలు, చట్టపరమైన శిక్షలు, జీవితంలో మంచి లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. అదనంగా మొబైల్ ఫోన్ల వినియోగంపై నియంత్రణ, క్రమశిక్షణ పాటించడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ విధమైన కార్యక్రమాల ద్వారా యువతను సురక్షి తమైన, బాధ్యతాయుతమైన దిశలో నడిపించేందుకు పోలీస్ శాఖ తమవంతు కృషి చేస్తూనే ఉందని డీఎస్పీ శ్రీలత తెలిపారు.

## క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

### - ఎస్పీ తుషార్ డూడి వార్నింగ్



చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త: ఐపిఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి వార్నింగ్ ఇచ్చారు. దేశంలో క్రికెట్ అనేది ఒక ఆట కంటే ఎక్కువ అని, ఇది ఒక భావోద్వేగం, ఒక సంస్కృతి. ఈ ఆటను ఆస్వాదించడం ఒకటైతే దానిపై బెట్టింగ్‌కు పాల్పడటం మరొకటన్నారు. బెట్టింగ్ అనేది వినోదం కాదని ఒక వ్యసనం అన్నారు. బెట్టింగ్ వల్ల అనేకమంది ఆర్థికంగా నష్టపోయి అప్పుల ఊబిలో పడుతూ కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కొన్ని చోట్ల తీవ్ర ఒత్తిడిలో బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్యలు చేసుకునే స్థితికి చేరుకుంటున్నారన్నారు. చిత్తూరు జిల్లా పోలీసులు క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే గ్యాంగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మి బెట్టింగ్ మాఫియా వలలో పడకుండా జాగ్రత్తగా వుండాలన్నారు. బెట్టింగ్ ముఠాల చేతిలో మోసపోయిన వారు ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసు నమోదు చేస్తామన్నారు